మానవ తప్పిదమే

లుపిన్‌లో ప్రమాదంపై అధికారులు

- గత నెల 8న కూడా విషవాయువు లీక్
- నెల తిరగకుండానే మళ్లీ అదే తరహా ప్రమాదం
- సిబ్బందికి అవగాహన కల్పించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం

- 8లో

పేరుకే పెద్దేరు..

కుడి కాలువకు ప్రవహించని నీరు

- రిజర్వాయర్ వద్ద రెగ్యులేటర్ ఏర్పాటు చేయని అధికారులు
- కాలువల్లో పేరుకుపోయిన పూడిక, పెరిగిన తుప్పలు
- నిర్వహణను పట్టించుకోని అధికారులు
- ప్రశ్నార్థకంగా 12,500 ఎకరాల ఆయకట్టు
- రెండు దశాబ్దాల నుంచి సాగునీటి సమస్య


యర్రబంద వద్ద కుడి కాలువ పరిస్థితి

రావికమతం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి):
పెద్దేరు జలాశయం నుంచి రావికమతం మండలంలోని భూములకు సాగునీరు అందడం కలగానే మిగిలిపోయింది. రెండు దశాబ్దాల కాలంలో పలు ప్రభుత్వాలు మారినప్పటికీ సాగునీటి కాలువ సమస్యను ఎవరూ పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పటి ఇంజనీరింగ్ అధికారుల అవగాహనరాహిత్యం, పాలకుల నిర్లిప్తత కారణంగా కాలువ నిర్మాణం అస్తవ్యస్తంగా జరిగిందని, కాలువలో నీరు ప్రవహించకపోవడంతో వర్షంపై ఆధారపడి పంటలు సాగు చేసుకుంటున్నామని వాపోతున్నారు.
ఈ సమస్యకు సంబంధించి వివరాల్లోకి వెళితే..


కాలువ నుంచి నీరు రాకపోవడంతో బుద్దిబంద, కవ్వగుంటలో భాళీగా వున్న పంట భూములు

మాడుగుల మండలం రావిపాలెం వద్ద పెద్దేరు నదిపై సుమారు రెండు దశాబ్దాల క్రితం రిజర్వాయర్ నిర్మించారు. కుడి, ఎడమ కాలువల ద్వారా మాడుగుల, రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లో ఇంచుమించు 20 వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది ప్రణాళిక. ఒక్క కుడికాలువ కిందే 12,500 ఎకరాల ఆయకట్టు వుంది. పెద్దేరు రిజర్వాయర్ నుంచి రావికమతం మండలం మేడివాడ పెద్ద చెరువు వరకు కుడి ప్రధాన కాలువను నిర్మించారు. మేడివాడ చెరువు నుంచి బుచ్చెయ్యపేట మండలంలో మరో పది కిలో మీటర్ల వరకు కాలువ ద్వారా ఆ మండలంలోని సాగునీటి చెరువులను నింపి ఆయకట్టుకు అందించాలన్నది ప్రణాళిక. కానీ కుడికాలువ మొత్తం పొడవు 49 కి.మీ.లు కాగా 29 కిలోమీటర్లు మాత్రమే తవ్వారు. మరోవైపు ఎడమ కాలువ కన్నా కుడికాలువ ఎక్కువ ఎత్తులో వుండడం, రెగ్యులేటర్ లేకపోవడంతో కుడి కాలువకు నీరు సరిగా పారడంలేదు. రావికమతం మండలంలో 17 గ్రామాల పరిధిలో సుమారు ఐదు వేల ఎకరాల ఆయకట్టు వుంది. కాలువ నుంచి చెరువులకు, వాటి నుంచి ఆయకట్టుకు నీరు అందించాలి. కానీ రిజర్వాయర్‌లో ఏడాది పొడవునా నీటి నిల్వలు వున్నప్పటికీ గత 20 ఏళ్లలో ఒక్కసారి కూడా ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు సరఫరా కాలేదు. కుడి కాలువ నిర్మాణ సమయంలో ఇరిగేషన్ అధికారులు చేసిన పొరపాట్లు, తరువాత కాలువల నిర్వహణను పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. కాలువలో పూడిక పేరుకుపోయింది. పిచ్చిమొక్కలు, చెట్లు పెరిగిపోయాయి. మాడుగుల మండలంలో బి.జాలంపల్లి నుంచి బుచ్చెయ్యపేట మండలం గున్నెంపూడి వరకు ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. కాలువ ... మిగతా 8వ పేజీలో

అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డులో

విస్తృతంగా సీసీ కెమెరాలు

- సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా
- మునగపాక పోలీసు స్టేషన్ సందర్శన


ఎస్పీ తుహిన్ సిన్హా

మునగపాక, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి):
అనకాపల్లి - అచ్యుతాపురం రోడ్డులో అవసరమైన చోటల్లా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ తుహిన్‌సిన్హా మునగపాక పోలీసులను ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ, న్నారు. సైబర్ నేరాల గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, పోస్టర్ల ద్వారా ప్రచారం చేయాలని చెప్పారు. అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యే వరకు వాహన ప్రమాదాల నివారణ కోసం అవసరమైన చోట స్టాపర్లు (ఇసుక డ్రమ్ములు) ఏర్పాటు చేయాలన్నారు. పరిమితికి మించి అధిక లోడుతో వెళ్లే లారీలపై కేసులు నమోదు చేసి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాలను వీలైనంత వరకు తగ్గించాలే చూడాలని, ఇందులో భాగంగా తరచూ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. అంతకు ముందు పోలీసు స్టేషన్‌లో అన్ని గదులను, సెల్‌ను పరిశీలించారు. సీసీ కెమెరాల నిర్వహణ గురించి ఆరా తీశారు. రికార్డులు తనిఖీ చేశారు. ఎస్పీ వెంట ఇన్‌చార్జి డీఎస్పీ మోహన్‌రావు, సీఐ ధనుంజయరావు, ఎస్‌ఐ పి.ప్రసాదరావు వున్నారు.

హాస్టళ్లకు హంగులు

సాంఘిక సంక్షేమ వసతిగృహాలకు కొత్త రూపు

- రూ.4.22 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- భవనాలకు మరమ్మతులు, మౌలిక వసతుల కల్పన
- బాలికల వసతిగృహాలకు ప్రహరీ గోడలు
- కొత్తగా మిక్సీలు, గ్రైండర్లు, వంటసామగ్రి
- విద్యార్థులకు తొలగిన ఇబ్బందులు


పెదబొడ్డేపల్లిలో సాంఘిక సంక్షేమ శాఖ బాలుర హాస్టల్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)
గత వైసీపీ ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేసింది. శిథిల భవనాలు, అరకొర వసతుల మధ్య విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ వసతి గృహాల ఆధునికీకరణ, మౌలిక వసతుల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. గత వైసీపీ హయాంలో అధ్వానంగా తయారైన వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పిస్తూ, విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా చర్యలు చేపడుతున్నారు.


అనకాపల్లి గాంధీనగర్‌లో మరమ్మతులు చేసిన సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహం

జిల్లాలో 21 ప్రీ-మెట్రిక్, ఆరు పోస్టు మెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. ప్రీ-మెట్రిక్ హాస్టళ్లలో 3,520 మంది, పోస్టు మెట్రిక్ హాస్టళ్లలో 845 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఆయా వసతి గృహాల్లో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయం, ప్రహరీ గోడల నిర్మాణం వంటి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.4.22 కోట్లు మంజూరు చేసింది. ఏపీ విద్యా మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ ద్వారా సమగ్ర శిక్ష నిధులతో వసతి గృహాల భవనాలకు మరమ్మతులు చేపట్టి ... మిగతా 8వ పేజీలో

విద్యార్థులకు మెరుగైన వసతులు



సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాల్లో మౌలిక వసతులు మెరుగుపడ్డాయి. ముఖ్యంగా బాలికల వసతి గృహాలకు రక్షణ చర్యల్లో భాగంగా ప్రహరీ గోడలు నిర్మించాం. ఐదో తరగతి లోపు విద్యార్థులకు ఉచితంగా నోట్‌పుస్తకాలు అందజేశాం. పిల్లలు తమ ఇళ్లల్లో వున్నట్టు భావించేలా వసతి గృహాలను తీర్చిదిద్దాం. మౌలిక వసతులు కల్పించడమే కాకుండా విద్యార్థుల చదువుతోపాటు క్రీడలు, యోగా కోసం ఏర్పాట్లు చేశాం.

రామానందం,
జిల్లా సాంఘిక సంక్షేమాధికారి, అనకాపల్లి

గూడు కోసం వెతుకులాట!

సొంత భవనం లేని డీఎంహెచ్ఓ కార్యాలయం

- మూడేళ్ల నుంచి ఎన్టీఆర్ ఆస్పత్రిలో కొనసాగింపు
- పడకల సంఖ్య పెంచడానికి.. ఖాళీ చేయాలని నోటీసు
- అద్దె భవనాల కోసం గాలించినా ఫలితం శూన్యం
- ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో వసతి కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి



అనకాపల్లిలో ఎన్టీఆర్ ఆస్పత్రిలో డీఎంహెచ్ఓ కార్యాలయం

అనకాపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి):
అనకాపల్లి కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడి మూడేళ్లు పూర్తయినా.. ప్రభుత్వ కార్యాలయాలకు వసతి సమస్య తీరలేదు. పలు జిల్లాస్థాయి కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించక, అద్దె భవనాలు లభించకపోవడంతో ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన భవనాల్లో సర్దుకుపోతున్నాయి. దీనివల్ల తమకు అసౌకర్యంగా వుందంటూ సొంత భవనాలు వున్న శాఖల అధికారులు చెబుతూ, త్వరగా ప్రత్యామ్నాయ వసతి చూసుకోవాలని స్పష్టం చేస్తున్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) కార్యాలయానికి ప్రస్తుతం ఇదే తరహా సమస్య ఎదురైంది.

గత వైసీపీ ప్రభుత్వం జిల్లాల పునర్విభజన పేరుతో కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అనకాపల్లి కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడింది. విశాఖ నుంచి పలువురు అధికారులను, ఉద్యోగులను తరలించిన నాటి ప్రభుత్వం.. ఆయా కార్యాలయాలకు అవసరమైన వసతిని సమకూర్చలేదు. జిల్లా కేంద్రంలో అత్యధిక శాఖలకు సొంత భవనాలు లేవు. కొన్ని శాఖలు అందుబాటులో వున్న భవనాలను అద్దెకు తీసుకుని కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. వైద్య, ఆరోగ్య శాఖకు అద్దె భవనం లభించకపోవడంతో ఎన్టీఆర్ ఆస్పత్రిలోని ఒక విభాగంలో ఏర్పాటు చేశారు. మూడేళ్లు దాటినా సొంత భవనం నిర్మించుకోలేదు.. అద్దె భవనంలోకి మారలేదు. మరోవైపు ఆస్పత్రికి రోగుల తాకిడి పెరుగుతుండడంతో ... మిగతా 8వ పేజీలో

హాట్ కేకుల్లా సీఎస్ఈ సీట్లు

కంప్యూటర్ సైన్స్‌కు కొనసాగిన డిమాండ్

- ఆ తరువాత స్థానంలో ఈసీఈ...
- ఎంసెట్ తొలిదశ కౌన్సెలింగ్ ముగిసేసరికి ప్రముఖ కళాశాలల్లో 'ఏ' కేటగిరీ సీట్లు 90 నుంచి 95 శాతం భర్తీ
- మరికొన్ని కాలేజీల్లో 80 శాతం...
- మేనేజ్‌మెంట్ సీట్లకూ గిరాకీ
- సంవత్సరానికి రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షలు వసూలు



విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి):
ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి తొలి దశ కౌన్సెలింగ్ (ఎంసెట్..ఈఏపీసెట్) ముగిసింది. గతంలో మాదిరిగానే కంప్యూటర్ సైన్స్, ఆ తరువాత ఈసీఈలో చేరేందుకు విద్యార్థులు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. తొలి దశలోనే పేరొందిన కళాశాలల్లో దాదాపు 90 నుంచి 95 శాతం భర్తీ అయినట్టు నిర్వాహకులు చెబుతున్నారు. కొన్ని కళాశాలల్లో 70 నుంచి 80 శాతం భర్తీ అయ్యాయంటున్నారు. గతంలో మాదిరిగానే ఈ ఏడాది కూడా కంప్యూటర్ సైన్స్ సీట్లకు డిమాండ్ కనిపించింది.

ఉమ్మడి విశాఖ జిల్లాలో 24 ఇంజనీరింగ్ కాలేజీలు ఉన్నాయి. వాటిల్లో 19,980 సీట్లను భర్తీ చేసుకునేందుకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) అనుమతి ఇచ్చింది. ఏ కేటగిరీకి సంబంధించి సుమారు 13,986 సీట్లు ఉండగా, తొలి దశ కౌన్సెలింగ్ ముగిసే నాటికి సుమారు 11,000 వరకూ భర్తీ అయినట్టు కళాశాలల ప్రతినిధులు చెబుతున్నారు. కంప్యూటర్ సైన్స్, ఈసీఈ, ఈఈఈ బ్రాంచీల్లో అధికంగా విద్యార్థులు చేరినట్టు ప్రిన్సిపాల్స్ చెబుతున్నారు. గతంలో మాదిరిగానే కంప్యూటర్ సైన్స్‌కు భారీ డిమాండ్ ఏర్పడింది. తొలి దశలో కోరుకున్న బ్రాంచీలో సీటు వచ్చిన విద్యార్థులు చేరిపోగా, రానివారు రెండో విడత కౌన్సెలింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. ఆంధ్ర యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కాలేజీలో ఉన్న 605 సీట్లు అయిపోయాయి. సీట్లు అలాట్ అయినా ఆయా కాలేజీల్లో ఐదు నుంచి పది మంది వరకూ చేరలేదు. వారిలో జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ ర్యాంకర్లు ఉన్నారు. ఇంజనీరింగ్ కాలేజీ సీట్లను రెండు కేటగిరీలుగా ... మిగతా 8వ పేజీలో

స్విమ్మింగ్ పూల్‌లో యువకుడి మృతి

కొండకర్ల ఆవ సమీపంలోని రిసార్ట్‌లో ఘటన

- అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు
- గతంలో ఇదే తరహాలో నలుగురు మృత్యువాత
- అనుమతులు లేకుండా రిసార్ట్ నిర్వహిస్తున్న వైసీపీ నేత
- ఇంతవరకు చర్యలు తీసుకోని అధికారులు


సవరాల భాస్కర్ (ఫైల్ ఫొటో)

అచ్యుతాపురం రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి):
మండల పరిధిలోని కొండకర్లలో వున్న జీవీఈహెచ్ రిసార్టు స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతూ ఒక యువకుడు మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. ఈత కొడుతూ అలసిపోయి నీటిలో మునిగిపోయి మృతిచెందినట్టు ప్రాథమికంగా గుర్తించారు. ఇందుకు సంబంధించి సీఐ నమ్మి గణేశ్ తెలిపిన వివరాలిలా వున్నాయి.

కశింకోట మధ్య వీధికి చెందిన సవరాల భాస్కర్ (24) గాజువాకలో ఐటీఐ చదివాడు. ప్రస్తుతం అక్కడే ఒక సెలూన్ షాపులో పనిచేస్తున్నాడు. మంగళవారం సెలవు కావడంతో మరో ఎనిమిది మంది ... మిగతా 8వ పేజీలో

బల్క్ డ్రగ్ పార్కుపై నేడు ప్రజాభిప్రాయ సేకరణ

నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాట్లు

- పర్యావరణ, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సభ
- 15-20 మందికే మాట్లాడే అవకాశం?

నక్కపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి):
మండలంలో ఏర్పాటు కానున్న బల్క్‌డ్రగ్ పార్కుకు సంబంధించి బుధవారం రెండో విడత ప్రజాభిప్రాయసేకరణ సభ జరగనున్నది. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ, డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐలు కె.కుమారస్వామి, ఎల్.రామకృష్ణ మంగళవారం సాయంత్రం ఇక్కడకు వచ్చి ఏర్పాట్లను పరిశీలించారు. పర్యావరణం, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయసేకరణ జరుగుతుందని ఆర్డీవో చెప్పారు.

నక్కపల్లి మండలంలో బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. ప్రధాని నరేంద్ర మోదీ గతంలో విశాఖ పర్యటనకు వచ్చినప్పుడు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. కాగా బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుకు మొత్తం 1,514 ఎకరాలు అవసరమని అధికారులు గుర్తించారు. ఇందులో 700 ఎకరాలకు సంబంధించి రెండున్నరేళ్ల కిందట మొదటి విడత ... మిగతా 8వ పేజీలో


ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లు

ఉపాధి కూలీలకు ముఖ ఆధారిత హాజరు

- అక్రమాలు, బినామీలకు అడ్డుకట్ట
- డ్వామా పీడీ పూర్ణిమాదేవి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ పూర్ణిమాదేవి

సబ్బవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి):
ఉపాధి హామీ పథకం పనులకు హాజరయ్యే కూలీలకు ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి అని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమాదేవి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం అనకాపల్లి, కశింకోట, మునగపాక, పరవాడ, సబ్బవరం, రావికమతం మండలాల ఏపీవోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ అధారిత హాజరుతో అక్రమాలను, బినామీలను అరికట్టవచ్చని అన్నారు. ఉపాధి పనులు తప్పనిసరిగా రెండు పూటలా చేయాలని స్పష్టం చేశారు. ఉపాధి కూలీలకు రోజుకు కనీసం రూ.300 వేతనం లభించేలా పనులు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీ మణికుమార్, ఏపీవో వసంతకుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొరుప్రోలు సొసైటీ చైర్‌పర్సన్‌గా రామకృష్ణ బాధ్యతల స్వీకారం



చైర్‌పర్సన్ రామకృష్ణ, డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

ఎస్.రాయవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా గుర్రం రామకృష్ణతో పాటు ఇద్దరి డైరెక్టర్లు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ తనకు చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించిన హోం మంత్రి వంగలపూడి అనితకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే చైర్‌పర్సన్ బాధ్యతలు చేపట్టిన తరువాత రైతులకు రూ.19.9 లక్షల రుణాలు మంజూరు చేసినట్టు రామకృష్ణ తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన చైర్‌పర్సన్ రామకృష్ణ, డైరెక్టర్లు కోన అప్పలరాజుతో పాటు మరో డైరెక్టర్‌ను టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మాజీ ఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, నాయకులు పద్దు, వెంకటరాజు, తుంపాల నాగేశ్వరరావు, పల్లెల జగ్గారావు, వి శ్రీను, పి శ్రీను, జనసేన యూత్ మండల ప్రెసిడెంట్ లింగంపల్లి జ్యోతి కుమార్ తదితరులు సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడా మైదానంలో చెత్త తొలగింపు



క్రీడా మైదానంలో చెత్త తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది

ఎలమంచిలి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలో పేరుకుపోయిన చెత్త, కాలువలో పూడికను మంగళవారం మునిసిపల్ అధికారులు బాబూకట్ సాయంతో తొలగింపజేశారు. సచివాలయ సిబ్బందితో పాటు మునిసిపల్ సిబ్బంది మైదానాన్ని సర్వాంగ సుందరంగా తయారు చేశారు. క్రీడామైదానంలో చెత్త తొలగించడం పట్ల క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డుపై ఉత్సవ సామగ్రి విక్రయాల నిషేధం

ఎలమంచిలి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శ్రావణ శుక్రవారం, వినాయక చవితి తదితర పండుగలకు సంబంధించిన వస్తు సామగ్రిని రోడ్డుకు ఇరుపక్కలా విక్రయించడాన్ని నిషేధిస్తున్నట్టు మునిసిపల్ అధికారులు మంగళవారం తెలిపారు. మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వీధి వ్యాపారులు అంగీకారం తెలిపారన్నారు. వీధి వ్యాపారాలన్నీ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో చేయడానికి వ్యాపారులు అంగీకరించారన్నారు. ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు.

మండల పాస్టర్స్ సహవాసం నూతన కార్యవర్గం



ఎలమంచిలి మండల పాస్టర్స్ సహవాసం నూతన కార్యవర్గం

ఎలమంచిలి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాకివాని వీధిలోని యేసుక్రీస్తు ప్రార్థన సహవాసం చర్చిలో మంగళవారం పాస్టర్స్ మండల సహవాసం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమంలో కేపీడీఆర్. ప్రసాద్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని ప్రిన్స్ మినిస్ట్రీస్ అధినేత క్రాంతి పాల్ బలపరిచారు. నూతన కార్యవర్గం చైర్మన్‌గా డాక్టర్. పీటర్, గౌరవాధ్యక్షుడిగా డాక్టర్. కె.కృపారావు, అధ్యక్షుడిగా డాక్టర్. డి.ప్రభుదాస్, ఉపాధ్యక్షుడిగా ఏ.జాన్సన్, ఎస్. సాల్మన్ రాజు, కార్యదర్శిగా కె.జగదీష్ పాల్, సహాయ కార్యదర్శిగా సీహెచ్. శాంతరాజు, కోశాధికారిగా ఎ.ఎజ్రా, ఉప కోశాధికారిగా వి.సుదర్శన్, ముఖ్య సలహాదారులుగా ఎస్. ప్రసన్నరావు, అర్జున్ మాస్టర్, డి.ఏసుదానం, జి. యేసుపాదం, టి, కృపావరం, బ్రదర్ వి. జాన్, ఎలియాజర్, బ్రదర్ టైటస్, వి.జాన్సన్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యుపీఎఫ్ ప్రెసిడెంట్ యేసురత్నం, సహాయ కోశాధికారి నాని, ప్రెసిడెంట్ రాజా ఫినేహస్ పాల్గొన్నారు.

అందుబాటులోకి యూరియా



రైతులకు యూరియా అందజేస్తున్న కూటమి నాయకులు

మునగపాక, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులోకి రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. మండలంలో తిమ్మరాజుపేట రైతు సేవా కేంద్రంలో మంగళవారం యూరియాను కూటమి నేతలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజులు మాట్లాడుతూ రైతులు అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం చొరవ చూపుతోందన్నారు.

ట్రైనీ ఐఏఎస్ అధికారిణి మానసకు సత్కారం



ట్రైనీ ఐఏఎస్ మానసను సత్కరించిన ఆలయ కమిటీ సభ్యులు

మునగపాక, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారిని ట్రైనీ ఐఏఎస్ అధికారి రావాడ మానస మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆమెకు కమిటీ పెద్దలు, సభ్యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంకల్పం బలంగా ఉంటే సాధించలేనిది ఏదీ ఉండదన్నారు. చినవాల్తేర్‌లో ప్రభుత్వ వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తూ ఐఏఎస్‌కు ప్రయత్నం చేశానన్నారు. మూడో ప్రయత్నానికి ముందు మునగపాక అయ్యప్పస్వామి ఆలయంలో రాహు,కేతు మండపంలో కాలసర్ప దోష నివారణ పూజలు చేశానని చెప్పారు. మొక్కులు చెల్లించడానికి మరోమారు వచ్చానని తెలిపారు. అనంతరం ఆలయ అర్చకుడు సోమశేఖర్‌శర్మ, కమిటీ పెద్దలు, సభ్యులు మొల్లేటి సరళ, సత్యనారాయణ, పెంటకోట ఉమేష్, కాండ్రేగుల జగ్గారావు ఆమెను సత్కరించారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే వరిలో అధిక దిగుబడులు



నక్కపల్లిలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు



పెదరాంభద్రపురంలో పొలం బడి కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

రాంబిల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రవిబాబు, హరిపురం బీసీటీ కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాద్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని మురకాడ, కట్టుబోలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శాస్త్రవేత్తలు తొలుత ఆయా గ్రామాల్లో వరినారు మడులను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమయ్యారు. వరిలో నారుమడి, నాట్లు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువులు, సూక్ష్మపోషకాల అవశ్యకత, జీవన ఎరువుల గురించి వివరించారు. మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ చెల్లింపునకు సంబంధించి క్రెడిట్ అవ్వని రైతులు పేరు మార్పులు, ల్యాండ్ సీడింగ్, మరణ ధ్రువీకరణ, మ్యూటేషన్ కేసులను సరిచేయించుకొని సంబంధిత పత్రాలను రైతుసేవా కేంద్రాల్లో ఉన్న వ్యవసాయ సిబ్బందికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, హేమ, కనకరత్నం, జ్యోతి, మేఘన, విఏఏలు చిక్కాల రామారావు, చొచ్చుపట్ల సూర్యప్రకాశరావు, రైతులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

ప్రకృతి వ్యవసాయ విధానాలను రైతులు పాటిస్తే ఎంతో ఉపయోగకరంగా వుంటుందని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ చెప్పారు. మండలంలోని జానకయ్యపేటలో మంగళవారం ఏవో ఉమా ప్రసాద్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు, సామూహిక నియంత్రణ చర్యలతో మేలైన ఫలితాలు ఎలా పొందాలో వివరించారు. కొబ్బరిలో చీడపీడల నివారణ, కాయలు రాలిపోకుండా జోరాన్ పోషక యాజమాన్యం, తెల్ల దోమ నియంత్రణ గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈవో సాయి కుమారి, రైతులు కురందాసు చిన్నబ్బాయి, కురందాసు నూకరాజు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో..

మండలంలోని యండపల్లిలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఏవో సరోజని మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో కషాయాలు, జీవామృతం, ఘన జీవామృతం, వేపగింజల కషాయం గురించి వివరించారు. జీవామృతం వలన పురుగులు, తెగుళ్ల నివారించడంతోపాటు మొక్క ఎదుగుదలకు దోహదపడుతుందన్నారు. సదస్సులో ఆత్మ సిబ్బంది టెక్నాలజీ మేనేజర్ పీ సత్యవేణి, వ్యవసాయశాఖ సిబ్బంది ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది రమణమ్మ రవి ప్రభావతి, సుదర్శన్, నాగ గోవింద్ పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో..

సమగ్ర సస్యరక్షణ ద్వారా పంటలను చీడపీడల నుంచి కాపాడుకోవచ్చని మండల వ్యవసాయశాఖాధికారి ఆదినారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని పెదరాంభద్రపురం, గుంటపల్లి గ్రామాల్లో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో శాస్త్రవేత్త శ్రీహరితో కలిసి ఆయన ఆయా గ్రామాల్లో కొబ్బరి, తమలపాకు తోటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

» టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్



మడకపాలెంలో కరపత్రాలను టీడీపీ నాయకులు విజయ్, మంజు తదితరులు

మునగపాక, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధికి పెద్దపీటగా కూటమి పాలన కొనసాగుతోందని టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్ అన్నారు. మండలంలో మడకపాలెంలో సోమవారం రాత్రి సుపరిపాలన తొలి అడుగులో భాగంగా ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు సక్రమంగా అమలవుతున్నాయన్నారు. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు మాట్లాడుతూ తల్లికి వందనం తరువాత మహిళలకు మరో వరంగా ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి రానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాండ్రేగుల శంకర్, రాము, రమేష్, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన చేస్తున్నదని టీడీపీ మండల కార్యదర్శి గెంజి శ్రీను, రాష్ట్ర ప్రతినిధి రాజాన నారాయణమ్మ అన్నారు. మండలంలోని లైనుకొత్తూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా స్థానిక నేతలతో కలిసి ఇంటింట తిరిగి వివరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి శ్రీను, నారాయణమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడమే కాకుండా రెట్టింపు పథకాలు, అభివృద్ధిని చేశారన్నారు. ఏడాది పాలనలో రెట్టింపు పెన్షన్లు అందించడంతో పాటు మహోన్నత పథకాలను అమలు చేశారన్నారు. అభివృద్ధి అంశాలతో కూడిన కరపత్రాలను ఇంటింటికి అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గొలగాని నాగేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లి పాలు ఎంతో శ్రేష్ఠం

జడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు



వెల్ బేబీకి బహుమతులు అందజేస్తున్న జడ్పీటీసీ సభ్యుడు సూరిబాబు తదితరులు

పాయకరావుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బిడ్డకు తల్లి పాలు ఎంతో శ్రేష్ఠమని జట్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు అన్నారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి తల్లిపాల వారోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. అపుడే పుట్టిన బిడ్డకు ముర్రు పాలు తాగిస్తే బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. జిల్లా బాలల పరిరక్షణ ప్రతినిధి డి.లోవరాజు మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డకు మొదటి టీకా వంటిదన్నారు. అనంతరం వెల్ బేబీ షో నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా తల్లిపాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వాచ్ఓ నెహ్రూ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.లలిత, రంజాన్ బీబీ, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆశవర్కర్లు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.



ఎలమంచిలిలో వెల్‌బేబీ షో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఎలమంచిలిలో..

పట్టణంలోని రామ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంతోపాటు పలు కేంద్రాల్లో మంగళవారం వెల్‌బేబీ షో కార్యక్రమాలను నిర్వహించారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం చిన్నారులను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దడానికి అవకాశం ఉంటుందని అంగన్‌వాడీ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నారులతో పాటు బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది నూకరత్నం పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

తల్లిపాలు బిడ్డకు అన్నివిధాల శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్‌వీఎస్ రాణి అన్నారు. తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా రాంబిల్లి శివారు వాడపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం వెల్ బేబీ షో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వయస్సుకు తగ్గ బరువు ఉన్న పిల్లలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోతిక, అంగన్‌వాడీ కార్యకర్త వనజ, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించవద్దు : సీపీఎం



అచ్యుతాపురం సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం శ్రేణులు

అచ్యుతాపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గృహ విద్యుత్ వినియోగానికి స్మార్ట్ మీటర్లు వద్దని, విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ సీపీఎం శ్రేణులు మంగళవారం స్థానిక సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం కన్వీనర్ రొంగలి రాము మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపుతోందన్నారు. కార్యక్రమంలో కె.సోమినాయుడు, కర్రి అప్పారావు, కె. రామసదాశివరావు, ఆర్. సత్తిబాబు, నాయుడు, ఆర్. లక్ష్మి పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

స్థానిక సచివాలయం వద్ద మంగళవారం స్మార్ట్ మీటర్లును వ్యతిరేకిస్తూ సీఐటీయూ నేతలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు మాట్లాడుతూ కరెంట్ చార్జీలు, ట్రూ అప్ సర్ చార్జీల పేరుతో ప్రజలపై విపరీతమైన భారాన్ని ప్రభుత్వం మోపిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు, నేతలు నారాయణరావు, రామకృష్ణ, కాశియ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ గ్రావెల్ లారీని పట్టుకున్న పోలీసులు

మునగపాక, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉమ్మలాడ గ్రామం వద్ద మంగళవారం గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకున్నట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. అందిన సమాచారం మేరకు ఉమ్మలాడ వెళ్లగా గ్రావెల్‌కు సంబంధించి ఎటువంటి పత్రాలు లేకుండా లారీలో రవాణా చేస్తున్నారన్నారు. లారీని సీజ్ చేశామని, కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.తదుపరి చర్యలు కోసం మైన్స్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లామని చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలని జర్నలిస్టుల ఆందోళన



ఎలమంచిలి తహశీల్దారు కార్యాలయాధికారికి వినతిపత్రాన్ని అందజేస్తున్న ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు

అచ్యుతాపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పాత్రికేయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు బెజవాడ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఏపీయూడబ్ల్యూజె పిలుపు మేరకు మంగళవారం డీటీ శ్యామ్ కుమార్‌కి జర్నలిస్టులు వినతిపత్రాన్నిచ్చారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఆరోగ్య కార్డులు, అక్రిడేటేషన్ కార్డులు, ప్రైవేట్ పాఠశాల్లో ఫీజు రాయితీలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

మునగపాక: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజె ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు జర్నలిస్టులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో విలేకర్ల సంఘం మండల అధ్యక్షుడు దాడి అరుణ్‌కుమార్, కార్యదర్శి వెలగా జగదీష్, కొయిలాడ జగన్నాథరావు, శరగడం సీతారాం, కర్రి భాస్కర రావు, బుజ్జి, ఆడారి ఆత్మారాం తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలి: ఎలమంచిలిలో ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు, సభ్యులు మంగళవారం ఆర్టీసీ బస్టాండ్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక విలేకర్లు సీహెచ్. సంతోష్, ఏబీఎల్.రాజు, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్లపై సుముఖత : తహశీల్దార్



టీడీఆర్ బాండ్లపై తహశీల్దార్‌కు అంగీకారపత్రం అందజేస్తున్న మునగపాక నిర్వాసితులు

మునగపాక, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): టీడీఆర్ బాండ్లను తీసుకునేందుకు నిర్వాసితులు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారని తహశీల్దార్ పి.సత్యనారాయణ అన్నారు. మునగపాక గ్రామానికి చెందిన పలువురు అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణ నిర్వాసితులు మంగళవారం తహశీల్దార్‌ను కలిసి అంగీకార పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వాసితుల్లో ఒకరైన టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్ మాట్లాడుతూ ప్రమాదాలు నివారణతో పాటు అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వం రోడ్డు విస్తరణకు చొరవ చూపుతోందన్నారు. దానిని దృష్టిలో పెట్టుకొనే బాండ్లు తీసుకునేందుకు ముందుకొచ్చామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెంటకోట ఆదినారాయణ, ఆదినారాయణనాయుడు, శ్రీనివాసరావు, పెంటకోట అజయ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన పాప బంధువులకు అప్పగింత



కుటుంబ సభ్యులకు పాపను అప్పగించిన సీఐ గణేష్

అచ్యుతాపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం జంక్షన్‌లో తప్పిపోయిన కోమలి అనే చిన్నారిని పోలీసులు బంధువులకు మంగళవారం అప్పగించారు. అచ్యుతాపురానికి చెందిన కోమలి సోమవారం వరుసకు అత్తమామలైన వారితో స్టేట్ బ్యాంక్ రోడ్డులో షాపింగ్‌కి వచ్చింది. షాపింగ్ మూడ్‌లో ఉన్న బంధువులు పాపను గమనించలేదు. అరగంట తర్వాత చూసేసరికి పాప కనబడలేదు. దీంతో వీరు వెతకటం ప్రారంభించారు. అయితే రోడ్డుపై ఏడుస్తూ కనిపించిన పాపను కొందరు పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లారు. ఏడుస్తూ ఉన్న పాప ఫొటోను సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీంతో మంగళవారం ఉదయం బంధువులు వచ్చి కోమలిని తీసుకువెళ్లారు.

పేటకట్టు నుంచి మొదలైన పంట నమోదు

మునగపాక, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మునగపాక పేటకట్టు రైతు మూల సంఘం నుంచి ఖరీఫ్ పంట నమోదు ప్రక్రియ మొదలైంది. స్థానిక రైతు సేవా కేంద్రం అధికారిణి లలిత మంగళవారం క్షేత్రస్థాయిలో నమోదు చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆడారి మహేష్, కోశాధికారి ఆడారి లక్ష్మణరావు, రైతులు మళ్ల సంజీవరావు, మళ్ల జగ్గఅప్పారావు పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు

రాంబిల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ బోర్డు పథకాల పునరుద్ధరణ కోసం సెప్టెంబరు 15న చేపట్టే చలో విజయవాడను జయప్రదం చేయాలని భవన నిర్మాణ సంఘం (సీఐటీయూ) జిల్లా మహాజన సభ తీర్మానించింది. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన జిల్లా మహాజన సభలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ బోర్డు నుంచి సంక్షేమ పథకాలు అమలు జరగడం లేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేయలేదన్నారు. సంక్షేమ బోర్డును రద్దు చేయడానికి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం సిద్ధమైందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సెప్టెంబరు 15న సంక్షేమబోర్డు కమిషనర్ కార్యాలయానికి తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు అడిగర్ల రాజు, అధ్యక్షుడు కె.రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అప్పారావు, జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం : ధర్మశ్రీ

రాంబిల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరించిందని వైసీపీ ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని మర్రిపాలెం, మురకాడ, దిమిలి గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ధర్మశ్రీ మాట్లాడుతూ ఎరువులు, యూరియాను సబ్సిడీపై ఇవ్వాలని కోరినా కూటమి ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండలశాఖ అధ్యక్షుడు పి.కిషోర్, మాజీ అధ్యక్షుడు జి.శ్రీనుబాబు, నేతలు నెట్టెం సత్యనారాయణ, ఎన్వీ.సూర్యనారాయణ, కొవిరి రామకృష్ణ, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠశాల గుర్తింపు కార్డులు అందజేత

అచ్యుతాపురం రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం అదే గ్రామానికి చెందిన నాగల త్రినాథ్, సూర్యకళ దంపతులు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యా బోధన జరుగుతుందన్నారు. తమ పిల్లలను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మారిశెట్టి వెంకట అప్పారావు, అంగన్‌వాడీ కార్యకర్త భారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

భూముల వివరాలను రైతులు పరిశీలించుకోవాలి



మాట్లాడుతున్న తహశీల్దారు ఎస్‌వి.మహేశ్వరరావు

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపురం రెవెన్యూలో భూముల వివరాలు సక్రమంగా ఉన్నదీ లేనిదీ రైతులు పరిశీలించుకోవాలని తహశీల్దారు ఎస్‌వి. మహేశ్వరరావు కోరారు. మంగళవారం మండలంలోని శ్రీరాంపురంలో భూముల రీసర్వే ఫైనల్ పబ్లికేషన్‌కి సంబంధించి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ రీసర్వేలో అభ్యంతరాలుంటే తెలియజేయాలని, లేకుంటే భూముల క్రయవిక్రయాలకు రైతులు ఇబ్బందులు పడతారన్నారు. ప్రభుత్వ, ఆలయాల భూముల జోలికివస్తే సహించేదిలేదని హెచ్చరించారు. సర్పంచ్ గారా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ శ్రీరాంపురం రెవెన్యూలో ఈనాం, సీలింగ్, జిరాయితీ భూముల వివరాలు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చించెలప్ప ప్రదీప్, ఆర్ఐ త్రినాథ్, వీఆర్వోలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

ఘన వ్యర్థాల నిర్వహణతో సంపద

» జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

తుమ్మపాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఘన వ్యర్థాల నిర్వహణతో పర్యావరణం బాగుపడడంతో పాటు సంపదను సృష్టించవచ్చునని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. అనకాపల్లి మండలంలోని మార్టూరు గ్రామంలో ఘన వ్యర్థాల నిర్వహణపై మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇళ్లల్లోని చెత్తను తడి, పొడి చెత్తలుగా వేరు చేసి వాహనాలకు అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని ఆమె స్పష్టం చేశారు. సంపద కేంద్రాల నిర్వహణతో గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంపద కేంద్రాల జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి, గ్రామ సర్పంచ్ కరణం రెవెన్యూనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు మిద్దె రాజాచంద్రరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన: కలెక్టర్

పరవాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన జరుగుతుందని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ సీఎస్ఆర్ నిధులు రూ.20 లక్షలతో అభివృద్ధి చేసిన పరవాడ ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, చదువుతో పేదరికాన్ని జయించవచ్చునని, అందువల్ల కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. విద్యాభివృద్ధికి గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని నిధులు కేటాయించి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమా చిగురుపాటి, పరవాడ సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, తహశీల్దార్ బి.నాగరాజు, ఎంఈవోలు ఎం.దివాకర్‌రావు, జి.సాయిశైలజ, వసతిగృహం మేట్రిన్ రజని పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

» ఆర్డీవో కార్యాలయ ఏవోకు ఏపీయూడబ్ల్యూజే వినతిపత్రం


ఏవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీయూడబ్ల్యూజే అనకాపల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. జర్నలిస్టుల కోర్కెల దినంలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. పాత అక్రిడేషన్ గడువును పొడిగించకుండా జర్నలిస్టులందరికీ కొత్త అక్రిడేషన్లు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర, జిల్లాస్థాయి అక్రిడేషన్ కమిటీల్లో జర్నలిస్టుల యూనియన్‌లకు ప్రాతినిధ్యం కల్పించాలని, వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని, విశ్రాంత పాత్రికేయులకు పించన్ ఇవ్వాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పెంటకోట జోగినాయుడు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మద్దాల రాంబాబు, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి బీమరశెట్టి గణేశ్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు చాగంటి సర్వారావు, జిల్లా కార్యదర్శి ఆళ్ల వెంకటఅప్పారావు, సభ్యులు కె.భాను, రమణాజీ, ఎస్.ప్రసాద్, రవి, సీతారాం, గంగాధర్, మణికుమార్, బి.కిరణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొణతాలకు వినతి

తుమ్మపాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు మంగళవారం జర్నలిస్టులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశ్ మాట్లాడుతూ జర్నలిస్టుల అక్రిడేషన్ల విషయంలో ప్రభుత్వం న్యాయబద్ధంగా వ్యవహరించాలని కోరారు. జర్నలిస్టుల చిరకాల వాంఛ ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్కె చాంద్‌బాషా, సిహెచ్.శశికుమార్, పి.నాగశ్రీనివాసరావు, పి.సురేశ్, మోహన్, బి.కొండలరావు, విల్లూరి హరికృష్ణ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు పరవాడ విద్యార్థులు


పోటీలకు ఎంపికైన విద్యార్థులు వీరే..

పరవాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాల విద్యార్థులు ఆర్.యువరాజ్, కె.కోవిద, ఎ.హర్షిత జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. విశాఖలో గత నెల జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో వీరు ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 7 నుంచి 13వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని డైరెక్టర్ జి.మధుబాబు తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ పి.సూర్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, సీఈవో నిశాంత్ అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో కూడా సత్తా చాటాలని వారు ఆకాంక్షించారు.

ఇళ్లకు జియో ట్యాగింగ్ చేయించుకోండి

» గృహ నిర్మాణ శాఖ ఏఈ పింకీ


సదస్సులో మాట్లాడుతున్న ఏఈ పింకీ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఒక సెంటు గృహ లబ్ధిదారులు తప్పనిసరిగా జియో ట్యాగింగ్ చేయించుకోవాలని అనకాపల్లి పట్టణ గృహ నిర్మాణ శాఖ ఏఈ పింకీ సూచించారు. పట్టణంలోని సచివాలయాల్లో మంగళవారం జరిగిన సభల్లో ఆమె మాట్లాడారు. లబ్ధిదారులు జియో ట్యాగింగ్ చేయించుకోవడంతో పాటు విధిగా ఐసీఐసీఐలో బ్యాంక్ అకౌంట్ తెరవాలని స్పష్టం చేశారు. ఒకటి నుంచి 14వ సచివాలయం వరకు విజయరామరాజుపేట రైల్వే అండర్‌బ్రిడ్జి వద్దగల సచివాలయానికి బుధవారం బ్యాంక్ అధికారులు అకౌంట్ తెరిపించడానికి వస్తారని, అందువల్ల లబ్ధిదారులు హాజరై అకౌంట్లు ఓపెన్ చేసుకోవాలని చెప్పారు. 15 నుంచి 27వ సచివాలయం లబ్ధిదారులు పార్కు సెంటర్ వద్ద గల సచివాలయంలో బుధవారం అకౌంట్‌లు ఓపెన్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మురుగు కదలదు.. కంపు వదలదు!

మూలపేటలో పడకేసిన పారిశుధ్యం

» మురుగు కాలువలపై అక్రమ నిర్మాణాలు
» పారిశుధ్య నిర్వహణకు సిబ్బంది ఇబ్బందులు
» రోజుల తరబడి కాలువల్లోనే మురికి నీరు తిష్ఠ
» భరించలేని దుర్వాసనతో ప్రజల అగచాట్లు
» చీకటి పడితే గ్రామస్థులపై దోమల దండయాత్ర


మూలపేట గ్రామంలోని కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

కొత్తూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీ మూలపేట గ్రామంలో పారిశుధ్యం లోపించింది. కాలువల్లో మురుగు పేరుకుపోయింది. నిర్వహణ కొరవడడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. ఫలితంగా ప్రజలను రోగాల భయం వెంటాడుతోంది.

ఈ గ్రామంలోని కాలువలపై నిర్మాణాల వల్ల చెత్తచెదారం స్తంభించిపోతున్నది. కొన్ని చోట్ల రోడ్డుకి ఒక పక్క ఉన్న కాలువలు శుభ్రం చేసినప్పటికీ, మరికొన్ని చోట్ల కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో నిర్వహణకు అవకాశం లేకపోతోంది. ఫలితంగా మురుగు పేరుకుపోయి దోమల ఎక్కువవుతున్నాయి. దీంతోరాత్రి సమయంలో గ్రామస్థులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది.

రామాలయం నుంచి సచివాలయం వరకు ఒక పక్క కాలువలు వేసి ఉన్నాయి. మరో పక్క కాలువలు నిర్మించలేదు. అయితే నిర్మాణం చేసిన ఒక కాలువలపై కూడా ఇళ్లకు మెట్లు ఏర్పాటు చేయడంతో పూర్తిగా కాలువలు శుభ్రం చేయలేని పరిస్థితి నెలకొంది. దీనిపై పంచాయతీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో పారిశుధ్య కార్మికులు కాలువలు శుభ్రం చేయలేని పరిస్థితి నెలకొంది. మరికొన్ని చోట్ల కాలువలు ఏర్పాటు చేసి పైకప్పులు వేయడం మరవడంతో దోమలు ఎక్కువవుతున్నాయి. ఇప్పటికైనా ఆక్రమణలు తొలగించి రోడ్డుకిరువైపులా కాలువలు నిర్మించాలని, కాలువలు శుభ్రం చేసి దుర్వాసన రాకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.


కాలువలపై ఇళ్లకు నిర్మించిన మెట్లు, కాలువపై వేసిన సిమెంట్ పలకలు


గ్రామంలోని మరో కాలువల్లో పేరుకుపోయిన మురుగు

స్మార్ట్ మీటర్లు బిగించొద్దని వామపక్షాల ధర్నా




అనకాపల్లి ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద వామపక్ష నాయకుల ధర్నా... పరవాడ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్మార్టు మీటర్లు బిగించవద్దని, విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈపీడీసీఎల్ కార్యాలయం ఎదుట వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు స్మార్ట్‌మీటర్లను పగులగొట్టాలని చెప్పి అధికారంలోకి వచ్చి మళ్లీ వాటినే బిగించడాన్ని ఖండిస్తున్నామన్నారు. మోదీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయి గత వైసీపీ ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లకు ఒప్పందాలు చేసుకొని అదానీ సంస్థకు టెండర్లను కట్టబెట్టి భారీ కుంభకోణానికి పాల్పడిందని ఆరోపించిన కూటమి ప్రభుత్వం, మరలా అవే స్మార్ట్ మీటర్లను బిగించాలని చూడడం సరికాదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శిఎం. రామునాయుడు మాట్లాడుతూ తక్షణమే స్మార్ట్ మీటర్ల బిగింపును రద్దు చేయాలని, వినియోగదారుల పై భారాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సీపీఐ పట్టణ కార్యదర్శి వైఎన్ భద్రం, నాయకులు పెంటకోట శ్రీనివాసరావు, బొప్పే ఉమామహేశ్వరావు, కె.తేలయ్యబాబు, జి.సుభాషిణి, రైతు సంఘాల నేత కె.శంకరరావు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ర్యాలీ

కశింకోట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించవద్దని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డీ.డీ.వరలక్ష్మి, సీఐటీయూ నేత దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ అదానీ సంస్థ ద్వారా తయారు చేసిన విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించడాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఇదే స్మార్ట్ మీటర్లను బిగించినప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కూటమి నాయకులు అప్పట్లో పగలగొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చి నిరసన తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం మాదిరిగానే ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తే అర్థం ఏముందని ప్రశ్నించారు. అనంతరం ఏఈ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎం.సత్తిబాబు, కె.నాగరాజు, బెన్నయ్య, బి.నూకరాజు, ఎం.అప్పలస్వామినాయుడు, గోవింద, నూకునాయుడు, బలరాం, అప్పారావు పాల్గొన్నారు.

పరవాడలో ఆందోళన..

పరవాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అదనపు భారంగా మారుతున్న అదానీ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు గృహాలకు బిగించవద్దన్నారు. ఇప్పటికే ట్రూఆప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. తక్షణమే స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, సీపీఎం నాయకులు వీవీ.రమణ, పి.మాణిక్యం, ఐద్వా ప్రతినిధులు ఎం.బంగారమ్మ, అన్నపూర్ణ, సీతమ్మ, సాయివేణి, నాగదేవి, ఎస్కే బేగం, గౌరి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అరవై ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ప్రముఖ వైద్యులు, ఎన్టీఆర్ వైద్యాయం అభివృద్ధి కమిటీ సభ్యులు డీడీ నాయుడు సూచించారు. స్థానిక రైతు భారతిలో వయోవృద్ధుల సంక్షేమ సంఘం సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన డాక్టర్ నాయుడు మాట్లాడుతూ వయసు పెరిగిన తరువాత అనేక రకాల వ్యాధులు చుట్టుముడతాయన్నారు. వాటిని ఎదుర్కోవడానికి యోగాసనాలు తరచూ వేయాలని సూచించారు. చిన్న వయసు నుంచే భగవద్గీత చదివితే, పెద్దయ్యాక బాధ్యతాయుతంగా వ్యవహరించవచ్చునన్నారు. దివ్యాంగుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆనయ్య మాట్లాడుతూ కలెక్టర్‌తో మాట్లాడి వయోవృద్ధులకు విశ్రాంత భవనం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడును సత్కరించారు. సంఘ అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు కె.దుర్గాప్రసాద్, ఎస్.నూకరాజు, బుద్ద తాతారావు, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జూట్ బ్యాగుల పంపిణీ

కశింకోట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు 650 జ్యూట్ బ్యాగులను మంగళవారం పంపిణీ చేశారు. బయ్యవరం గ్రామంలోని సాగర్ సిమెంట్ కంపెనీ ఏజీఎం పీవీ.పాండురంగారావు వీటిని అందించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనార్థాలను విద్యార్థులకు ఆయన వివరించారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం తగ్గిస్తే భూమి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్లాస్టిక్ సంచులను నిర్మూలించి గోనె సంచులు వాడాలని చెబుతూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ సిబ్బంది ఎస్.కె.మదీనా వలి, ఎ.నారాయణరావు, పి.అప్పారావు, ఎల్.శ్రావణ్‌కుమార్, ఎ.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ స్వర్ణకుమారి పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం విఫలం'

అనకాపల్లి టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆరోపించారు. పట్టణంలోని 84వ వార్డులో మంగళవారం బాబు షూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడం లేదన్నారు. ఇప్పటికీ మహిళలకు ఉచిత బస్ పథకం అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు ఎం.జానకిరామరాజు, నాయకులు జాజుల రమేశ్, వేగి త్రినాథ్, కోరుకొండ రాఘవ, కొణతాల మురళీకృష్ణ, అప్పికొండ రవి పాల్గొన్నారు.

తల్లిపాలతో పిల్లలకు మేలు

పరవాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలతో బిడ్డలకు ఎంతో మేలు చేకూరుతుందని ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. శిశువు ఎదుగుదలకు తల్లిపాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేసి చీరలు, పండ్లు అందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

పరవాడ/లంకెలపాలెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదముషిడివాడ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం బుధవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా పెదముషిడివాడ, మార్కండేయ కాలనీ, పెదముషిడివాడ హైస్కూల్ ఏరియా, సిద్ధి వినాయకనగర్, వినాయకనగర్, విజయరాంపురం, గండివానిపాలెం, పచ్చికూరవానిపాలెం, నక్కవానిపాలెం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన


యాప్‌పై అవగాహన కల్పిస్తున్న జోనల్ కమిషనర్ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 83వ వార్డులో జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి వాట్సాప్ గవర్నెన్స్‌పై మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు వేగంగా, సులభంగా చేరాలని వాట్సాప్ గవర్నెస్ మనమిత్రను ప్రారంభించినట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. ఇంటి నుంచే ప్రభుత్వ సేవలన్నీ పొందాలని సూచించారు. ఈ సందర్భంగా శానిటేషన్ కార్మికులందరికీ యోగా టీ షర్టులను పంపిణీ చేశారు. అందరూ యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని అధిగమించాలని జడ్సీ సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ రవి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

నేడు స్టాండింగ్ కమిటీ ఎన్నిక

» అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
» ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్
» అనంతరం లెక్కింపు.. ఫలితాలు వెల్లడి
» కూటమి అభ్యర్థుల గెలుపు లాంఛనమే

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికకు అధికారులు ఏర్పాట్లుపూర్తిచేశారు. ప్రధాన కార్యాలయంలోని పాతకౌన్సిల్‌హాల్‌లో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటుచేశారు. వచ్చే ఏడాది మార్చి 13 వరకు ఉండే ఈ స్టాండింగ్ కమిటీకి పది మంది సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. దీనికోసం కూటమి తరపున టీడీపీ నుంచి తొమ్మిది మంది, బీజేపీ నుంచి ఒకరు, వైసీపీ నుంచి పది మంది పోటీలో నిలిచారు. కూటమికి 63 మంది, వైసీపీకి 32 మంది సభ్యుల బలం ఉంది. సీపీఐ, సీపీఎంకు ఒక్కొక్కరు చొప్పున కార్పొరేటర్లు ఉన్నారు. వీరిలో జనసేనకు చెందిన 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్‌తోపాటు సీపీఎం కార్పొరేటర్ గంగారావు ఎన్నికను బహిష్కరిస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

బుధవారం ఉదయం పది గంటలకు పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం రెండు గంటల వరకు జరుగుతుందని కమిషనర్ కేతన్‌గార్గ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం ఓటుహక్కు కలిగిన కార్పొరేటర్లను మాత్రమే లోపలకు అనుమతిస్తామన్నారు. ఓటు వేసేందుకు వచ్చేవారంతా విధిగా తమ గుర్తింపు కార్డును తీసుకునిరావాల్సి ఉంటుందన్నారు. కౌన్సిల్‌హాల్ బయట ఉండే ఓటర్ ఐడెంటికేషన్ ఆఫీసర్‌కు గుర్తింపు కార్డు చూపించి, స్లిప్పు తీసుకుని పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించాల్సి ఉంటుందన్నారు. పెన్ను, పెన్సిల్, స్మార్ట్‌వాచ్‌లు, సెల్‌ఫోన్‌లు వంటి వాటిని అనుమతించబోమన్నారు. ఒక అభ్యర్థి గరిష్ఠంగా పది మందికి మాత్రమే ఓటు వేయాలని, అంతకుమించి ఓటు వేస్తే చెల్లని ఓటుగా పరిగణిస్తామన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు పోలింగ్ ముగుస్తుందని, అభ్యర్థుల సమక్షంలోనే బ్యాలెట్‌బాక్స్‌లను సీల్ వేస్తామన్నారు. మధ్యాహ్నం భోజనం తర్వాత ఓట్ల లెక్కించి, ఫలితాలను వెల్లడించడం జరుగుతుందన్నారు.

ఓటింగ్‌పై కార్పొరేటర్లపై అవగాహన

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఓటింగ్ విధానంపై పోటీలో నిలిచిన అభ్యర్థులతోపాటు కార్పొరేటర్లకు మంగళవారం అవగాహన కల్పించారు. అదనపు కమిషనర్లు రమణమూర్తి, ఎస్ఎస్ వర్మలు ఓటు వేసే విధానం, లెక్కింపునకు సంబంధించిన అంశాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

జ్వర బాధితులకు రక్త పరీక్షలు తప్పనిసరి

» జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి హైమావతి


పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

కొత్తూరు. ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చే ప్రతి ఒక్క రోగికి రక్తపరీక్షలు నిర్వహించాలని, రిపోర్ట్ ఆధారంగా సత్వర వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎం హెచ్‌వో) డాక్టర్ హైమావతి అన్నారు. మంగళవారం ఆమె అనకాపల్లి మండలం తగరంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. గర్భిణులకు అందిస్తున్న సేవల విషయంలో పనితీరు మెరుగుపరచుకోవాలని ఏఎన్ఎంలకు సూచించారు. సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండేలా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పావని, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువులకు నాణ్యమైన సేవలు అందించండి

» పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్


గవరపాలెం కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీడీ

తుమ్మపాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పశు వైద్యశాలల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) డాక్టర్ ఎం.చంద్రశేఖర్ ఆదేశించారు. అనకాపల్లిలోని గవరపాలెం, మార్టూరులలో పశువైద్య కేంద్రాలను మంగళవారం తనిఖీ చేశారు. కేంద్రాల్లో రికార్డులు, స్టాక్ పుస్తకాలను పరిశీలించారు. అలాగే వైద్య సేవల వివరాలపై ఆరా తీశారు. పశువుల పెంపకందారులకు లింగ విభజిత వీర్యం వాడకం, ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని పశు వైద్యాధికారులకు ఆయన సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాసం ఉత్పత్తిని ప్రోత్సహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు డాక్టర్ అనిల్‌కుమార్, సిబ్బంది వసంత, నిర్మల పాల్గొన్నారు.

బావి విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరించాలని నిరసన


తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు, నాయకులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గవరపాలెం ముత్రాసికాలనీ రాతి నుయ్యి బోరు మోటారు విద్యుత్ కనెక్షన్‌ను పునరుద్ధరించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. 40 ఏళ్లుగా రైతులు ఈ బావి నీరును తోడుకుంటూ వ్యవసాయం చేసుకుంటున్నారని, ఎవరో ఇచ్చిన ఫిర్యాదుకు విద్యుత్ శాఖ అధికారులు కనెక్షన్‌ను తొలగించడం అన్యాయమని వాపోయారు. దీనివల్ల వ్యవసాయ భూములకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే విద్యుత్ కనెక్షన్‌ను పునరుద్ధరించి మోటార్ వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బుద్ద రమణాజీ, మళ్ల చక్రవర్తి, విల్లూరి గణేశ్, కర్రి పరదేశినాయుడు, వేలం జగదీశ్ పాల్గొన్నారు.

ఉద్యానవన సాగుకు ప్రభుత్వ పోత్సాహం


రైతుకిమొక్కలను అందజేస్తున్న ఎంపీపీ కుమారి, టీడీపీ మండలాధ్యక్షుడు కొండలరావు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో ఉద్యాన పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని టీడీపీ మండలాధ్యక్షుడు పొత్తూరు కొండలరావు అన్నారు. మంగళవారం ఈ.కొడిసింగి గ్రామంలో ఉపాధి హామీ పథకం అధికారులు ఉద్యాన మొక్కలు పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో 51 కుటుంబాలకు ఎంపీపీ బోయిన కుమారితో కలిసి మొక్కలను ఆయన పంపిణీ చేశాడు. ఈసందర్భంగా మాట్లాడుతూ గంజాయి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆదివాసీలు ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంట మొక్కలను ఉచితంగా పంపిణీ చేయడంతోపాటూ మూడేళ్లపాటు సాగు ప్రోత్సాహాలను అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండలాధ్యక్షుడు కంకపాటి గిరిబాబు, జనసేన మండలాధ్యక్షుడు కొయ్యం బాలరాజు, ఏపీవో సీహెచ్ వరప్రసాద్, ఈసీ శ్రీను పాల్గొన్నారు.

గ్యాస్ గోడౌన్ ఏర్పాటుకు వినతి


పౌర సరఫరాల శాఖ మంత్రికి మనోహర్‌కు వినతి పత్రం ఇస్తున్న జనసేన నేత

కొయ్యూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్యాస్ గోడౌన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని పాడేరు పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతి అందచేసినట్టు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గూడెపు లక్ష్మణ్ తెలిపారు. మండలంలో గ్యాస్ గోడౌన్ లేక 60 కిలోమీటర్ల దూరంలో గల చింతపల్లి నుంచి వంట గ్యాస్ సిలిండర్లు తేవాల్సివస్తోందని, దీని వల్ల గ్యాస్‌బండకు అదనంగా లబ్ధిదారుడు రూ. 100 లు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంటున్నట్టు మంత్రికి వివరించినట్టు తెలిపారు. మండలంలో కాకరపాడు కేంద్రంగా ఏర్పాటు గ్యాస్ గోడౌన్ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా మంత్రిని కోరామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి శేషుబాబు, ఉపాధ్యక్షుడు రాంప్రసాద్. వీర మహిళ భావన జయంతి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే భవిష్యత్తు: ఎస్ఐ

డుంబ్రిగుడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కూడిన చదువు భవిష్యత్తునిస్తుందని స్థానిక ఎస్ఐ పాపినాయుడు అన్నారు. మండలంలోని నందివలస బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎస్ఐ సందర్శించారు. పాఠశాలలోని విద్యార్థినులకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలు శారీరక ఎదుగుదలకు తోడ్పడతాయన్నారు.

జీసీసీ ఉద్యోగుల సమస్యలపై వినతి

అనంతగిరి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక హరిత రిసార్ట్స్ వద్ద మంత్రి నాందెడ్ల మనోహర్‌ను కలిసి పలు సమస్యలపై స్థానిక జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు మంగళవారం వినతిపత్రమిచ్చారు. రేషన్ డీలర్లను జీసీసీ ఉద్యోగులుగా గు ర్తించాలని,జీసీసీ బంక్‌లో ఉద్యోగాలు చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మండలంలోని దా యర్తి సబ్ డిపోను వెంటనే ప్రారంభించాలని కోరారు. కళ్యాణగుమ్మి స్టాక్ పాయింట్, కడరేవ్, కొట్టంగుడ, చిందులపాడు, తట్టబూడి, సొలబొంగులకు కొత్తగా డిపోలను ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలోని సర్పంచ్ మోస్య, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దంటూ నిరసన

అరకులోయ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల గృహాలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనులు నిలిపివేయాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. మంగళవారం స్థానిక విద్యుత్ శాఖ ఏడీ ఆఫీస్ ఎదుట నిరసన వ్యక్తంచేశారు.అనంతరం మె యిన్ రోడ్డుకు చేరుకుని నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేత ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గతంలో జగన్ హయాంలో స్మార్ట్ మీటర్లపై వ్యతిరేకించిన ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వీటినితిరిగి అమలు చేయడం అన్యాయమన్నారు. సీపీఎం మండల కార్యదర్శి గత్తుం బుజ్జిబాబు, చిట్టం నాయక్, గురుమూర్తి, పాంగినానిబాబు, సత్తిబాబు , చిట్టిబాబు, గాసి, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

అరకులోయ, ఆగస్టు 5(ఆంధ్ర్యజ్యోతి):ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన మిత్ర యాప్ ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎ. లవరాజు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం సుంకరమెట్ట పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ చినబాబు ఆధ్వర్యంలో వాట్సాప్ గవర్నెన్స్ (మనమిత్ర యాప్) వినియోగంపై ర్యాలీ, అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ మన మిత్ర యాప్ లో 520 కంటే ఎక్కువ సేవలను పొందే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు ఈ వాట్సాప్ ఫోన్: 95523 00009 ద్వారా సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


సుంకరమెట్టలో చేపట్టిన ర్యాలీలో ఎంపీడీవో, సచివాలయ ఉద్యోగులు


చింతపల్లిలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

సుంకరమెట్టలో అవగాహన ర్యాలీ

చింతపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత ప్రజలు వాట్సాప్ గవర్నెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక మేజర్ పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకుమార్ అన్నారు. మంగళవారం పురవీధుల్లో వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్‌తో పలు రకాల ప్రభుత్వ సేవలను పొందేందుకు వాట్సాప్ గవర్నెన్స్ అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. ప్రజలంతా ఫోన్: 955230 0009లో వాట్సాప్ ద్వారా సేవలు పొందవచ్చునన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

చీడిపల్లిలో విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరం

» అనారోగ్య కారణాలతో ఉపాధ్యాయుడికి డిప్యుటేషన్

» 40 మందికి భాషా వలంటీర్‌తో బోధన

కొయ్యూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో బూదరాళ్ళ పంచాయతీ చీడిపల్లి ఎంపీ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న శాశ్వత ఉపాధ్యాయుడు నాగభూషణంను ఆరోగ్యపరమైన సమస్యలను చూపి వేరొక పాఠశాలకు విద్యాశాఖాధికారులు డిప్యుటేషన్ పంపించడంతో గ్రామంలోని విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం సుమారు 40 మంది విద్యార్థులు గల ఈ పాఠశాలలో ఒక్క భాషా వలంటీరుతో బోధన కొనసాగిస్తున్నారు. డిప్యుటేషన్ వెళ్లిన ఉపాధ్యాయుడి స్థానంలో వేరొకరిని ఇక్కడ నియమించలేదు. గడిచిన 20 రోజులుగా విద్యార్థులు పాఠశాలకు వచ్చినా విద్యాభ్యాసానికి నోచుకోక ఆటపాటలతో కాలక్షేపం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా అధికారులుశాశ్వత ఉపాధ్యాడిని నియమించాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈవో రాంబాబును వివరణ కోరగా.. పాఠశాల ఉపాధ్యాయుడిని మెడికల్ గ్రౌండ్స్‌లో కించవానిపాలెం వేశామన్నారు. ఆయన స్థానంలో బడుగు రామకృష్ణ అనే ఉపాధ్యాయుడుని డిప్యుటేషన్‌పై నియమించినట్టు తెలిపారు. అయితే, మంగళవారం మధ్యాహ్నం వరకు వలంటీరుతోనే పాఠశాల నిర్వహించడం గమనార్హం.


భాషా వలంటీరుతో కొనసాగుతున్న చీడిపల్లి ప్రాథమిక పాఠశాల

సారా రహిత గ్రామంగా పెదబయలు: సీఐ


మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ ఆచారి

పెదబయలు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నాటు సారా రహిత గ్రామంగా సీతగుంట పంచాయతీ పెదబయలు మండల కేంద్రాన్ని మంగళవారం ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రకటించారు. పాడేరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టీవీవీ వీఎస్ఎన్ ఆచారి, అనకాపల్లి ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రత్యేక అధికారి, సీఐ బి. జగదీశ్ మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. నవోదయం కార్యక్రమంలో భాగంగా సారా విక్రయాలు చేపడుతున్న గ్రామాలపై దృష్టిసారించినట్టు చెప్పారు. పలువురిపై కేసులు నమోదు చేసినట్టు వివరించారు. ఈ క్రమంలో పెదబయలులో స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో పలువురికి అవగాహన కల్పించినట్టు వివరించారు. గతంలో జీవనానికి సారా విక్రయాల చేపట్టిన వారికి చిరు వ్యాపారాలతో ఉపాధి చూపేందుకు ప్రభుత్వ పరంగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. దీంతో ఇకపై నాటు సారా విక్రయాలు చేపట్టమంటూ గ్రామంలో పలువురిని నుంచి తీర్మానం తీసుకున్నామన్నారు. ఈ స్థితిలో గతంలో సారా విక్రయాల్లో సీ కేటగిరిలో ఉన్న పెదబయలును పూర్తిగా సారా రహిత గ్రామంగా ప్రకటిస్తున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పలాసి మాధవరావు, ఎంపీటీసీ సభ్యులు కిమంకరి బొంజుబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు వెచ్చంగి కొండయ్య , గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘం నేతల సేవా కార్యక్రమాలు


పుస్తకాలు, రాతసామగ్రి అందజేసిన ఏపీజీఈఏ తాలూకా నాయకులు

చింతపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) చింతపల్లి తాలూకా ప్రధాన కార్యదర్శి అనిమిరెడ్డి శంకరరావు అన్నారు. మంగళవారం ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ జన్మదినం పురస్కరించుకుని నాయకులు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. వాముగెడ్డ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, రాత సామగ్రి అందజేశారు. విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా తాలూకా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ సూర్యనారాయణ ఉద్యోగుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సంజయ్ కుమార్, గసాడి పద్మనాభం, హెచ్ఎం సింహాచలం, ఏవో మధుసూదనరావు, శోభన్‌బాబు, ఏపీసీపీఎస్ఈఏ జిల్లా నేత కుడుముల వెంకట రమణ పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ప్రవేశాల నిషేధం సరికాదు

» ఏఐఎస్ఎఫ్ నాయకులు



తలారిసింగి ఆశ్రమ పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

పాడేరురూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోకి ప్రజా సంఘాల నాయకుల ప్రవేశాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం చేసిన ప్రకటన ప్రజాస్వామ్య విరుద్ధంగా, విద్యార్థుల హక్కులు హరించేలా ఉందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రాజశేఖర్ అన్నారు. పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీ నాయకులు ప్రవేశించకూడదంటూ ఇటీవల విడుదల చేసిన ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ మంగళవారం ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల తలారిసింగిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు విద్యార్థుల సమస్యలు, హక్కులు, విద్యారంగంలో జరుగుతున్న అన్యాయాలపై పోరాటాలు నిర్వహిస్తున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ప్రైవేటు యాజమాన్యాల లబ్ధికోసమే ప్రభుత్వం ఇటువంటి నిషేధ ఉత్తర్వులు జారీ చేసిందని మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే వీటిని వెనక్కి తీసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి.కృష్ణ, నాయకులు తనీశ్ పాల్గొన్నారు.

సమస్యలపై పెసా గ్రామ సభలో తీర్మానాలు


గుర్రగరువులో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు లక్కు

పాడేరురూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పెసా గ్రామ సభల్లో తీర్మానాల పరిష్కారానికి ప్రాముఖ్యత కల్పించాలని మోదాపల్లి పంచాయతీ పెసా కమిటీ ఉపాధ్యక్షుడు పాలికి లక్కు డిమాండ్ చేశారు. మండలంలోని మోదాపల్లి పంచాయతీ గుర్రగరువు గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. సభలో గ్రామంలో ఉన్న సమస్యలు, వ్యక్తిగత సమస్యలపై చర్చించారు. తల్లికి వందనం పథకంలో అర్హులైన ఏడుగురు లబ్ధిదారులకు నిధులు మంజూరు చేయాలని, మోడల్ ప్రైమరీ స్కూల్‌గా ఎంపికైన గుర్రగరువు ఎంపీపీ పాఠశాలలో 60 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. ఈ స్థితిలో మధ్యాహ్నం భోజన పథకం అమలుకు అదనంగా మరో వంట మనిషిని ఏర్పాటు చేయాలని, పాఠశాలకు ప్రహరీ గోడను ఏర్పాటు చేయాలన్నారు. జన్‌మన్ పథకంలో గృహ లబ్ధి పొందని ఐదుగురికి, అర్హులైన నలుగురు పింఛన్ దారులకు లబ్ధి చేకూర్చాలని కోరారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం


ముంచంగిపుట్టులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ముంచంగిపుట్టు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలే బిడ్డలకు శేయస్కరమని స్థానిక ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు. బాలింతలు, గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. బాలింతలకు సీమంతాలు నిర్వహించారు. తల్లిపాల పాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ ఎస్.సుబాస్, వైద్యాధికారి గీతాంజలి, టీడీపీ నేత సన్యాసమ్మ, సూ పర్‌వైజర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

గూడెంకొత్తవీధి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న నిర్వహించున్న ఆదివాసీ దినోత్సవాన్ని అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోచల రామకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రం లో అఖిల పక్షం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంపీపీ బోయిన కుమారి, టీడీపీ మండలాధ్యక్షుడు పొత్తూరు కొండలరావు, గిరిజన ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడు పాతూని రామరాజు, జేఏసీ నాయకుడు కొర్ర బలరామ్, సర్పంచ్‌లు సిరిబాల బుజ్జిబాబు, కుందరి రామకృష్ణ, నాయకులు బొబ్బిలి లక్ష్మణ్, లకే రామరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

‘పాత్రికేయుల సమస్యలు పరిష్కరించాలి’

చింతపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ప్రభు త్వం మంజూరు చేయాలని స్థానిక ఏపీయూడబ్ల్యూజే ప్రెస్ క్లబ్ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు డి. సతీశ్, ఎస్. వనరాజు అన్నారు. మంగళవారం జర్నలిస్టుల కోర్కెల దినంపురస్కరించుకుని స్థానిక తహశీల్దార్ జి.ఆనందరావుకి వినతి పత్రం అందజేశారు.ఈసందర్భంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్య క్షులు మాట్లాడుతూ అర్హులైన విలేకరులకు అక్రిటిటేషన్ కార్డులు మంజూరుచేయాలన్నారు.హెల్త్ ఇన్సూరెన్సు సదుపాయం, విశ్రాంత పాత్రికేయులకు పింఛన్ సదుపాయం కల్పించాలన్నారు. ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు వీజే దయానంద్, విలేకరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: ఏపీడబ్ల్యూజే పిలుపు మేరకు మంగళవారం మండలంలోని పాత్రికేయుల సమస్యలతో కూడినవినతి పత్రాన్ని స్థానిక తహశీల్దార్ త్రివేణికు అందజేశారు. సమస్యలపై చర్చించారు.

పెదబయలు:జర్నలిస్టులసమస్యలను పరిష్కరించాలని మండల ం లోని జర్నలిస్టులు కోరారు. ఈ మేరకు మంగళవారం తహశీల్దార్ శ్రీనాథరావునాయుడుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో చిట్టిబాబు,విశ్వనాథం, పాల్గుణ, కొండబాబు, పూర్ణయ్య, ఈశ్వరరావు, సత్యనారాయణ, శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

కొయ్యూరు: పాత్రికేయులను ఆదుకునేలా ప్రభుత్వం చొరవ చూపాలని చింతపల్లి ప్రెస్‌క్లబ్ కార్యదర్శి డి. పద్మరాజు కోరారు. మంగళవారం పా త్రికేయుల డిమాండ్స్‌డేను పురస్కరించి ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడి న వినతిని తహశీల్దార్ కుమారస్వామికి అందచేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సత్యనారాయణ, దొరబాబు, లవకుశ, నరుకుల సత్తిబాబు, జొన్నాడ సత్యనారాయణ, వాసు, పి.సత్యనారాయణ, కె సత్యనారాయణ పాల్గొన్నారు.


చింతపల్లిలో తహసీల్దార్ ఆనందరావుకి వినతి పత్రమిస్తున్న పాత్రికేయులు

హుకుంపేట; జర్నలిస్టు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ పిలుపు మేరకు స్థానిక విలేకరులు రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ పొటంగి మో హన్‌రావుకు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గత ప్రభుత్వం 2019 -2024 మధ్యలో అడ్డగోలు నిబంధనలు 9 వేల అక్రిడిటేషన్లు కుదించినట్టు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు సాయి ప్రసాద్, గణేష్, బాలరాజు, గంగాధర్, పండు, ఆనంద్ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: ఏపీయూడబ్ల్యూజే మండల నేతలు తహశీల్దార్ శంకరరావు, ఎంపీడీవో సూర్యనారాయణమూర్తిలకు సమస్యలపై వినతి పత్రాలను అందించారు.ఈ కార్యక్రమంలో పాత్రికేయులు సురేశ్, విజయ్‌వెంకట్,మోహన్, నాగభూషణ్, భాస్కరరావు, కాంతారి మోహన్, పులిరాజు, అనిల్‌కుమార్, రాంబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులను చేర్పించాలి

» ఆర్జేడీ ఆదినారాయణ


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఆర్జేడీ ఆదినారాయణ

అనంతగిరి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపాలని ఇంటర్ బోర్డు రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) ఎం. ఆదినారాయణ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య, కోర్సుల వివరాలపై ప్రిన్సిపాల్ ప్రమీలను అడిగితెలుసుకున్నారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కళాశాలకు మంచి పేరు వచ్చేలా విద్యార్థులు చదవాలన్నారు. ఉన్నత చదువులకు ఇంటర్ ప్రాముఖ్యమని వివరించారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా బోధన ఉండాలని అధ్యాపకులకు సూచించారు. విద్యార్థులు డ్రాపౌట్ లేకుండా చూడాలని, అడిష్మన్లు మరింత పెంచాలని సూచించారు. అల్లూరి జిల్లా డీఐఈవో ఎస్. భీమశంకరరావు, ఏజీఎంసీ విశ్వనాథం, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు: ఏడీఏ


రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ తిరుమలరావు

చింతపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వరి సాగు చేపట్టాలని స్థానిక వ్యవసాయ సహాయక సంచాలకులు(ఏడీఏ) బీవీ తిరుమలరావు అన్నారు. మంగళవారం చౌడుపల్లి గ్రామ సచివాలయ పరిధి వాముగెడ్డ గ్రామా ల్లో వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు సకాలంలో వరి నాట్లు వేసుకోవాలన్నారు. నాట్లు వేసే సమయంలో నారు పిలకలను తుంచి వరుస పద్ధతిలో నాటుకోవాలన్నారు. గిరిజన రైతులు రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు పూర్తిగా విడిచిపెట్టాలన్నారు. ఘన, ద్రవ జీవామృతాలు, కషాయాలు ఉపయోగించాలన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ సాగు చేపట్టాలన్నారు. ఆధునిక , శాస్త్రీయ పద్ధతులను పాటించడం వల్ల నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లలిత కుమారి, ఏవో మధుసూదనరావు, పశువైద్యాధికారి సౌజన్యదేవి, అభ్యుదయ రైతు కరుణానిధి పాల్గొన్నారు.

శత శాతం రిజర్వేషన్ కోసం ఉద్యమం

» ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నేత బాలదేవ్


నినాదాలు చేస్తున్న నాయకులు

అరకులోయ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో ఆదివాసీలకు 50శాతం రిజర్వేషన్ కాకుండా శతశాతం అమలు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ జిల్లా కన్వీనర్ సాగిన ధర్మన్నపడాల్, ఆదివాసీ నిరుద్యోగుల సంఘం కన్వీనర్ సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆదివాసీ యువగళం జీపుజాతలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇటీవల జీవో-3కు ప్రత్యామ్నాయంగా ఏజెన్సీలో వందశాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. దీనిని నిలుపుకోవాలని కోరారు. లేకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. అలాగే, మెగా డీఎస్సీలో అల్లూరి జిల్లా ఐటీడీఏ పరిధిలో 400 పోస్టులకు గానూ 24 పోస్టులు మాత్రమే స్థానిక అభ్యర్థులకు కేటాయించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుజ్జిబాబు సాగిన సత్యనారాయణ, దర్మన్న పడాల్, భాను, గాషి, అప్పలస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఈసుబాబు, గిరిజన గురుకుల ఉపాధ్యాయ సంఘ జిల్లా నాయకులు కొండబాబు, చంద్రుపడాల్, కళాశాల విద్యార్థులు, అధాపకులు పాల్గొన్నారు.

చింతపల్లిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలి

చింతపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చింతపల్లిలో డయాలసిస్ కేంద్రం ఏర్పా టు చేయాలని కోరుతూ పౌరసరఫరాల శాఖమంత్రి నాడెండ్ల మనోహర్‌కి వినతి పత్రం అందజేసినట్టు జనసేన మండల నాయకుడు వాడకాని వినయ్ తెలి పారు. మంగళవారం అనంతగిరిలో పర్యటించిన మంత్రిని కలిసిన జనసేన నాయకులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా వినయ్ మాట్లాడుతూ చింతపల్లి సబ్ డివిజన్ పరిధి డయాలసిస్ బాధితులు పాడేరు, నర్సీపట్నం వెళ్లాల్సివస్తోందన్నారు. దీంతో ప్రయాణ భారం పెరిగిపోతుందన్నారు. చింతపల్లి ఏరియా ఆస్పత్రిగా స్థాయి పెంచడంతోపాటు డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పాడేరుతోపాటూ అరకులోయ, రంపచోడవరంలోనూ కేంద్రాలను పునరుద్ధరించాలని మంత్రిని కోరామన్నారు.


మంత్రి మనోహర్‌కి వినతి పత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

గుత్తులపుట్టును మండల కేంద్రం చేయాలని భారీ ర్యాలీ


కుంతుర్లలో ర్యాలీ చేస్తున్న గుత్తులపుట్టు మండల సాధన కమిటీ, గిరిజనులు

పెదబయలు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గుత్తులపుట్టును ప్రత్యేక మండలంగా ప్రకటించాలని మంగళవారం మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో మండలం కుంతుర్ల పంచాయితీ కేంద్రంలో గిరిజనులు భారీ ర్యాలీ నిర్వహించారు. పంచాయితీ పరిధిలోని బైతినిలంక, గులుగొండ, రాసిగుప్ప, సంపంగిదాటు, మర్రిదాటు, కన్నెలకట్టు గ్రామాల గిరిజనులు ఈర్యాలీలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గుత్తులపుట్టు మండల సాధన కమిటీ అధ్యక్షుడు వంతాల సూరిబాబు మాట్లాడుతూ పాడేరు మండలం నుంచి 9 పంచాయితీలు, పెదబయలు మండలం నుంచి 5 పంచాయితీలు, హుకుంపేట మండలం నుండి 3 పంచాయితీల్లోని గిరిజనులకు అనుకూలంగా గుత్తులపుట్టును ప్రత్యేక మండలంగా ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ చిన్నారావు, మండల సాధన కమిటీ గౌరవ అధ్యక్షుడు రామన్న, బాలకృష్ణ, రమణ, భాస్కర్‌రావు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఆశ కార్యకర్తలను భర్తీ చేయాలి: సీఐటీయూ

చింతపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆశ కార్యకర్తల పోస్టులు పారదర్శకంగా భర్తీ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. మంగళవారం ఆశ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ కార్యకర్తల పోస్టులు భర్తీలో రాజకీయ జోక్యంలేకుండా చూడాలన్నారు. అలాగే గిరిజన ప్రాంతంలో పనిచేస్తున్న 700మంది సీహెచ్‌డబ్ల్యూలను ఆశ కార్యకర్తలుగా మార్పు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పాంగి ధనుంజయ్, సాగిన చిరంజీవి పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

చింతపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమాచార హక్కు చట్టంపై చైతన్యవంతులు కావాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి అన్నారు. మంగళవారం ఆర్ట్స్, కామర్స్ విభాగాల అధ్యాపకులు విద్యార్థులకు ఈ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జగదీశ్ బాబు, సతీశ్, ఈశ్వర్, డాక్టర్ వి. రమణ, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.



తల్లి పాల వారోత్సవాల ర్యాలీలో కౌన్సిలర్ చింతకాయల పద్మావతి

గచ్చపువీధిలో తల్లిపాల వారోత్సవాలు

నర్సీపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధిలోని 26 వార్డు గచ్చపువీధిలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి కుమారి, బాలాజీ దంపతుల కుమార్తెతో వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి అన్నప్రాశన నిర్వహించారు. అనంతరం గచ్చపువీధి అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించారు. తహసీల్దార్‌తో మాట్లాడి గచ్చపువీధి అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి ఐదు సెంట్ల స్థలం మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో జీవీ రమణ, సిబ్బంది ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. బలిఘట్టం, పెదబొడ్డేపల్లి, నర్సీపట్నంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లలో పిల్లలకు తల్లి పాలు పట్టే గదులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీపీఎంవో ప్రశాంతి, వైద్యులు చాందిని, నందిని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

కవికి ఎమ్మెల్యే బండారు పరామర్శ

చీడికాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ప్రముఖ కవి కురచా నర్సింహ నాయుడుని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సోమవారం పరామర్శించారు. అప్పలరాజుపురం స్వగృహంలో నరసింహ నాయుడు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గవిరెడ్డి జగన్నాథం, కురచా సురేష్, గవిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కవి నరసింహనాయుడుని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

గోవాడ షుగర్స్‌ను పరిరక్షించడంలో కూటమి ప్రభుత్వం విఫలం

▸▸ వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్

బుచ్చెయ్యపేట, ఆగస్టు 5 (ఆంధ్ర జ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిరక్షించడంలో కూటమి ప్రభుత్వం విఫలం అయ్యిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. మంగళవారం ఆయన బంగారుమెట్టలో విలేకర్లతో మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంలో రూ.89 కోట్లు గ్రాంట్ విడుదల చేసి గోవాడ షుగర్ ఫ్యాక్టరీని కాపాడామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గత సీజన్‌లో కేవలం లక్ష టన్నుల క్రషింగ్ చేసి, ఆరు నెలలైన రైతులకు పేమెంట్‌లు ఇవ్వలేదన్నారు. కనీసం గోవాడ షుగర్స్ మహాజన సభ నిర్వహించ లేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. అనకాపల్లి రూరల్ జిల్లాలో రోడ్లు అధ్వానంగా ఉన్నప్పటికీ కూటమి ఎమ్మెల్యేలు పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో వైసీపీ నేతలపై తప్పుడు కేసులు, వేధింపులు తప్ప ప్రజలకు చేసింది శూన్యం అని అన్నారు. విలేకర్ల సమావేశంలో దొండా రాంబాబు, దొండా నారాయణమూర్తి, కె.అచ్చింనాయుడు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు

▸▸ ప్రమాదాలు జరిగితే రూ.10 లక్షల జరిమానా

▸▸ నర్సీపట్నం డీఎస్పీ పోతురెడ్డి శ్రీనివాసరావు

నర్సీపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ పోతురెడ్డి శ్రీనివాసరావు హెచ్చరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన యువతా మేలుకో అవగాహన సదస్సులో డీఎస్పీ మాట్లాడారు. మైనర్లకు వాహనాలు ఇచ్చినప్పుడు వారి కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగి ఎవరైనా చనిపోతే తల్లిదండ్రులకు రూ.10 లక్షలు జరిమానా పడుతుందన్నారు. అలాగే హెల్మెట్ పెట్టుకోకపోవడం, సరిగ్గా ధరించక పోవడం, నాణ్యత లేకపోవడం వంటి కారణాలతో రోడ్డు ప్రమాదాలలో 99 శాతం మరణాలు సంభవిస్తున్నాయని చెప్పారు. బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే పోక్సో కేసు నమోదు చేసి రౌడీ షీటు తెరుస్తామని డీఎస్పీ హెచ్చరించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు జోలికిపోయి యువత జీవితాలు పాడుచేసుకోవద్దని సూచించారు. యువతకు ప్రలోభపెట్టి గంజాయి రవాణాకు వాడుకుంటున్నారని తెలిపారు. ఉపాధ్యాయుడు చేతిలో బెత్తం.. పోలీసోడి చేతిలో లాఠీ లేకపోవడంతోనే వ్యవస్థలన్నీ పాడవుతున్నాయని డీఎస్పీ పేర్కొన్నారు. రూరల్ సీఐ రేవతమ్మ మాట్లాడుతూ గంజాయి కేసుల్లో పట్టుబడుతున్న వారు అత్యధిక శాతం విద్యార్థులు ఉంటున్నారని తెలిపారు. పట్టణ సీఐ గోవిందరావు మాట్లాడుతూ పిల్లలు మంచి ఉద్యోగం సాధిస్తే సమాజంలో తల్లిదండ్రులకు గౌరవం పెరుగుతుందన్నారు. చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విజయ్, డివిజన్ నాయకుడు గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

పాత్రికేయుల నిరసనలు.. రెవెన్యూ అధికారులకు వినతులు

నర్సీపట్నం/గొలుగొండ/మాకవరపాలెం/నాతవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం అన్ని మండలాల్లో రెవెన్యూ అధికారులకు వినతులు అందించారు. ఏపీయూడబ్ల్యూజే కోర్కెల దినం కార్యక్రమంలో భాగంగా నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి సుధాకర్‌కు వినతిపత్రం అందించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి సీహెచ్‌బీఎల్ స్వామి మాట్లాడుతూ అర్హత కలిగిన జర్నలిస్టులకు తక్షణమే కొత్త అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని, విశ్రాంత జర్నలిస్టులకు పింఛను సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యదర్శి కిశోర్, నర్సీపట్నం ఏరియా అధ్యక్షుడు విజయ్, కార్యదర్శి జె.శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు అప్పారావు, రామకృష్ణ, ప్రభాకర్ పాల్గొన్నారు.

గొలుగొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రం అందించారు. ప్రభుత్వం నుంచి అమలు చేస్తున్న జర్నలిస్టుల పథకాలను త్వరితగతిన అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఏపీయూడబ్ల్యూజే ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సకిరెడ్డి నానాజీ, నాయకులు సత్యనారాయణ, వరహాలబాబు, అచ్చిరాజు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారి వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

నాతవరం మండలంలో డిప్యూటీ తహసీల్దార్ టీవీఎల్ రాజుకు వినతిపత్రం అందజేశారు. కొత్త అక్రిడేషన్ల కార్డులు మంజూరు చేయాలని, బీమా సదుపాయం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏడీ.బాబు, శెట్టి శివసత్యనారాయణ, చింతకాయల వరహాలబాబు, హస్సేన్, కె.శ్రీను, ఎస్.రాము పాల్గొన్నారు. అలాగే మాకవరపాలెం తహశీల్దార్‌కు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు.

నాతవరం పీఏసీఎస్‌కు అవార్డు

ఉత్తమ పనితీరుకు షీల్డు అందించిన మంత్రి అచ్చెన్నాయుడు

నాతవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నాతవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఉత్తమ పనితీరుకు అవార్డు లభించింది. అభివృద్ధి పథంలో నడుస్తూ లాభలు ఆర్జిస్తుండడంతో అమరావతిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పీఏసీఎస్ చైర్మన్ అపిరెడ్డి మాణిక్యంకు షీల్డు, నగదు బహూకరించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోపరేటివ్ బ్యాంకులు ఏర్పడి 62 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లాభాల బాటలో నడిచే కోపరేటివ్ బ్యాంకులకు రూ.10 వేలు ఎఫ్‌డీ, షీల్డులను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ కార్యదర్శి ఆదినారాయణ తదితరలు పాల్గొన్నారు.



మంత్రి చేతుల మీదుగా షీల్డు అందుకుంటున్న చైర్మన్ మాణిక్యం

పాడి రైతులకు అందుబాటులో ఉండండి

▸▸ పశు సంవర్థక శాఖ ఏడీ రాంబాబు

గొలుగొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పాడి రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు (ఏడీ) రాంబాబు సూచించారు. మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో మంగళవారం పశు వైద్యులు, సచివాలయ పశు వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పాడి రైతులకు నాణ్యమైన పాల దిగుబడిపై అవగాహన పెంచాలని చెప్పారు. పోషకాలు కలిగిన పశుగ్రాసం పశువులకు అందించేలా రైతులను చైతన్య పర్చాలన్నారు. పాడి పెంపునకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సమావేశంలో పశు వైద్యులు దుర్గాప్రసాద్, శిరీషా, వెలుగు ఏపీఎం కరుణానిధి పాల్గొన్నారు.

వరి నారుమడుల్లో తెగుళ్ల నివారణకు ప్రత్యేక చర్యలు

నర్సీపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వరి నారు మడుల్లో తెగుళ్ల నివారణకు తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని అనకాపల్లి డీఆర్‌సీ వ్యవసాయ అధికారిణి పి.విజేత సూచించారు. మండలంలోని అప్పన్నదొరపాలెం గ్రామంలో మంగళవారం వరి ఆకుమడులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పాచి తెగులు నివారణకు హెక్సా కొనజోలు రెండు మిల్లీలీటర్లు మందును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అగ్గి తెగులు నివారణకు ట్రై సైక్లోజోలు ఒక మిల్లీ గ్రాము మందు ఒక లీటరు నీటిలో, జింక్ సల్ఫేట్ నివారణకు ఎనిమిది గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. జీవన ఎరువులు కేఆర్‌బీని 10 నుంచి 25 కిలోలు ఘట్టంలో ఒక లీటరు నీటిలో కలిపి నీడలో ఆరబెట్టి ఒక ఎకరం పొలంలో వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పొలంబడి

గొలుగొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసిమి, జమ్మవరం గ్రామాల్లో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి సుధారాణి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు అరకొరగా పడడంతో రైతులు ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. అలాగే ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. సాగు చేయని భూములకు ఈ క్రాప్ పంటల నమోదు చేయించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో బోర్ల మరమ్మతు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం లింగంపేట పంచాయతీలోని చేతిబోర్లకు మంగళవారం మరమ్మతులు చేశారు. పంచాయతీ శివారు రామచంద్రపురంలో తాళ్లచీడికాడ జంక్షన్‌లో సర్పంచ్ తోకల సంతోశ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి నాగవెంకటశివ ఈ పనులు చేయించారు. గ్రామంలో చేతి బోర్లు, విద్యుత్ బుల్బులు వేయటంతో పాటు పలు సమస్యల పరిష్కారంపై దృష్టిసారించినట్టు ఈ సందర్భంగా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి చెప్పారు.

వడ్డాదిలో పారిశుధ్య పనులు



వడ్డాదిలో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

బుచ్చెయ్యపేట ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలం వడ్డాదిలో పారిశుధ్య లోపంపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం గ్రామంలో పేరుకు పోయిన చెత్తను యంత్రాలతో తరలించారు. మురికి కాలువలను పారిశుధ్య కార్మికులు పరిశుభ్రం చేశారు. ఈవోపీఆర్‌డీ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు దగ్గరుండి పారిశుధ్య పనులను చేయించారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టడంతో వడ్డాది ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

ఓపీఎస్‌ను కొనసాగించాలని టీచర్ల నిరసన

దేవరాపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు మంగళవారం నిరసన తెలిపారు. సెప్టెంబరు 1న చలో విజయవాడ పేరిట నిర్వహించనున్న సీపీఎస్ ఉద్యోగుల నిరసన మహాసభను జయప్రదం చేయాలన్నారు. గందరగోళంగా ఉన్న జీపీఎస్, సీపీఎస్‌లను రద్దు చేయాలన్నారు. ఏపీటీఎఫ్ సీనియర్ నాయకులు నౌడు అప్పారావు, కె.రాంబాబు తదితరులు గోడపత్రికను ఆవిష్కరించారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్

దేవరాపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) ఆటోడ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సమగ్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు వేమల కన్నబాబు ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల హామీల్లో వాహన మిత్రలకు రూ.15 వేలు ఇస్తామని ప్రకటించారని, అధికారంలోకి వచ్చి 13 నెలలు గడుస్తున్నా వాహన మిత్రలకు నగదు వేయలేదన్నారు. ఆటో డ్రైవర్లను పోలీసులు, ప్రైవేటు ఫైనాన్షియర్లు వేధిస్తున్నాయన్నారు.

రాము కుటుంబాన్ని ఆదుకోవాలి

చోడవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మృతిచెందిన గాంధీగ్రామానికి చెందిన తాపీమేస్త్రీ దూది రాము కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు వీవీశ్రీనివాసరావు, ఎస్‌వీ. నాయుడు డిమాండ్ చేశారు. మృతుడు దూది రాము కుటుంబాన్ని మంగళవారం సీఐటీయూ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాము మృతితో ఆ కుటుంబం దిక్కు లేకుండా పోయిందని, మృతుడికి భార్య, ఐదేళ్ల పాప ఉందన్నారు. చనిపోయిన మేస్త్రీ కుటుంబానికి ప్రభుత్వం తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

దేవరాపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాలాబు పంచాయతీ శివారు రామన్నపాలెంకు చెందిన గెమ్మెల లక్ష్మి 108 అంబులెన్స్‌లో మంగళవారం మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆమెకు పురిటినొప్పులు రావడంతో కె.కోటపాడు సీహెచ్‌సీకి 108లో తరలిస్తుండగా మార్గమధ్యలో ఏ.కోడూరు వద్ద నొప్పులు తీవ్రం కావడంతో అంబులెన్స్‌లో ప్రసవించింది. పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.



108లో ప్రసవించిన గెమ్మెల లక్ష్మి

కల్యాణపులోవ నీరు విడుదల

రావికమతం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్యాణపులోవ రిజర్వాయర్ నీటిని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కోమటి శంకరరావు, ఆయకట్టు చైర్మన్ బంటు రామునాయుడు, ఇరిగేషన్ ఈఈ బాల సూర్యం ప్రత్యేక పూజలు చేసి నీటిని విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితుల కారణంగా కల్యాణపులోవలో ఈ ఏడాది ఆశించినంతగా నీరు చేరనప్పటికీ ఆయకట్టు రైతుల అభ్యర్థన మేరకు ఖరీఫ్‌కు నీరు విడుదల చేశామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా 13 కిలోమీటర్ల మేర కాలువల్లో పూడిక తీయించామని, కూలిపోయిన అక్విడెక్ట్‌ను పునఃనిర్మాణం చేశామన్నారు. నర్సీపట్నం ఇరిగేషన్ ఈఈ బాలసూర్యం మాట్లాడుతూ, జలాశయం నుంచి రోజుకు 50 క్యూసెక్కులు విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు గుటాల చిన్న, టి.అర్జాపురం సర్పంచ్ ఫాల్గుణ, తహశీల్దార్ అంబేడ్కర్, ఏఈ డి.సూర్య పాల్గొన్నారు.



కల్యాణపులోవ నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రాజు తదితరులు

పెద్దేరు కాలువ పూడికతీత పనులు ప్రారంభం

పెద్దేరు కాలువలో పూడికతీత పనులను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, ఆయకట్టు నీటి సంఘం ఉపాధ్యక్షుడు ఆర్లె గోవిందతో కలసి ప్రారంభించారు. మంగళవారం గర్నికం పంచాయతీ శివారు కానాడ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పెద్దేరు కాలువల సిమెంట్ లైనింగ్ పనులకు రూ.60 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఖరీఫ్‌తర్వాత ఈ పనులను ప్రారంభిస్తారన్నారు. ఆయకట్టు రైతుల అభ్యర్థన మేరకు ప్రస్తుతం కాలువల్లో పూడిక తొలగించాలని ఇరిగేషన్ అధికారులను కోరామని ఎమ్మెల్యే రాజు తెలిపారు. కానాడ గ్రామానికి రోడ్డు నిర్మాణానికి రూ.1.2కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే కాంట్రాక్టర్ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో పాఠశాల భవనాన్ని, ఆలయ కల్యాణ మండపాన్ని దశలవారీగా నిర్మిస్తామని గ్రామస్థులకు ఎమ్మెల్యే రాజు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కోమటి శంకరరావు, మండల మాజీ అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, పెద్దేరు డీఈఈ స్వామినాయుడు, తెలుగు రైతు మండల ఉపాధ్యక్షుడు కాళింగ తాతలు, పాల సంఘం అధ్యక్షుడు శ్రీను పాల్గొన్నారు.

కొమరవోలు ఆవను మినీ రిజర్వాయర్‌గా తీర్చిదిద్దుతాం : ఎమ్మెల్యే

రోలుగుంట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : గతంలో ఇచ్చిన హామీ మేరకు కొమరవోలు ఆవను మినీ రిజర్వాయర్‌గా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు తయారుచేస్తున్నామని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. మంగళవారం ఆయుకట్టు రైతులకు నీటిని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 400 ఎకరాల్లో ఉన్న ఆవలో నీరు నిల్వలు తగ్గిపోయాయన్నారు. ఆవను పూర్తిస్థాయిలో ఆధునీకరించి మినీ రిజర్వాయర్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఆధునీకరణ పూర్తయిన తర్వాత కొండకర్ల ఆవలా టూరిజం ప్రాంతంగా తయారు చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆవ సంఘం అధ్యక్షుడు పోతల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు దంట్ల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ గొర్లె చెల్లమ్మనాయుడు, దంట్ల రాజేష్, టీడీపీ మండల అధ్యక్షుడు పంచాడ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

తురకలపూడి పీహెచ్‌సీ తనిఖీ

బుచ్చెయ్యపేట ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో తురకలపూడి పీహెచ్‌సీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హైమావతి మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.ల్యాబ్‌లో జరుగుతున్న టెస్టులను పరిశీలించారు. అనంతరం మందులు గదిని పరిశీలించి, స్టాక్ లెక్క చూశారు. ఓపీ, లేబర్ గది, సిబ్బంది హాజరు పట్టిని పరిశీలించారు. మందుల రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గర్భిణులకు ఆస్పత్రులోనే ప్రసవాలు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించాన్నారు.



ల్యాబ్‌లో టెస్ట్‌ల వివరాలు అడుగుతున్న డీఎంహెచ్‌వో హైమవతి

స్మార్ట్ మీటర్లు వద్దంటూ సీపీఎం ఆందోళన

చోడవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల నెత్తినభారం మోపే లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, నవ యువ సమాఖ్యల ఆధ్వర్యంలో స్థానిక ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వినియోగదారుల అనుమతి లేకుండానే స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేశారని, తక్షణం ఈ మీటర్లు తొలగించాలని నాయకులు నందారపు భాస్కరరావు, అయితిరెడ్డి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. అనంతరం ఈపీడీసీఎల్ అధికారులకు వినతిపత్రం అందించారు.

మాడుగుల: విద్యుత్ స్మార్ట్ మీటర్లు వేయకుండా ప్రజలు అడ్డుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఇరట నర్సింహమూర్తి కోరారు. మంగళవారం మండలంలో శంకరం పంచాయతీ బొడ్డేవు గ్రామంలో ప్రజలకు కరపత్రాల పంపిణీ చేసి గిరిజనులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కె. భవాని, కొర్రా దేవదాసు, నాగార్జున విజయశాంతి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రావికమతం: స్మార్ట్ మీటర్లను బిగిస్తే పోరు తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.గోవిందరావు హెచ్చరించారు. మంగళవారం చీమలపాడు, అజయ్‌పురం, టి.అర్జాపురం, పి.కొట్నాబిల్లి గ్రామాల్లో సీపీఎం నాయకులు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పాంగి చంద్రయ్య, సింగారపు వరసయ్య, పాడి బెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నేతలు

చీడికాడ: మండలంలోని కోనాం శివారు కొండకొత్తూరులో మంగళవారం సీపీఎం మండల కార్యదర్శి రొంగలి దేముడునాయుడు ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కుంబోయిన కన్నబాబు, వంతంగి రాము, ఈడ శ్రీరామ్, రాజు, సన్నిబాబు, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు

మాడుగుల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మాడుగుల మోదకొండమ్మ అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక, స్థానికేతర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. అలాగే గ్రామానికి చెందిన భక్తులు అమ్మవారి ఘటాల పండుగను నిర్వహించారు.

ఘనంగా మరిడిమాంబ పండుగ



మరిడిమాంబని దర్శించుకున్న బత్తుల తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొండెపూడి మరిడిమాంబ అమ్మవారి పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, రాష్ట్ర హౌసింగ్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు ఎంవీవీ సత్యనారాయణ , గోకివాడ కోటేశ్వరరావు, జడ్‌పీటీసీ సభ్యుడు రాంబాబు, అచ్చంనాయుడు, తదితరులు దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న నాయకులను సర్పంచ్ ఆది సత్యనారాయణ, గ్రామ పెద్దలు సన్మానించారు.

ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టుల ఆందోళన

చోడవరం,ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలోని జర్నలిస్టులు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పాత్రికేయుల అక్రిడేషన్ల సమస్యలతోపాటు, ఇళ్ల స్థలాల మంజూరు, పింఛను సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆందోళన నిర్వహించారు. ధర్నా అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ ఆందోళనలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు డీవీఎం నాయుడు, కోవెల శ్రీనివాసరావు, బత్తుల రామకృష్ణ, శంకర్, ప్రగడ శ్రీనివాసరావు, రఘు, ఎస్.వీ. రమణ, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: పాత్రికేయుల న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కె.కోటపాడులో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో తహశీల్దార్ భుజంగరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో చోడవరం ప్రెస్‌క్లబ్ కార్యదర్శి ఎన్. సత్యనారాయణ, జర్నలిస్టులు కుబిరెడ్డి రాధాకృష్ణ, ఎస్. వెంకట్రావు, జి. బాలగంగాధర్, ఎన్. శ్రీను, వి. పరమేశ్వరరావు, ఎన్. అప్పారావు. ఎస్. పరమేష్, ఎస్. సతీష్ పాల్గొన్నారు.

దేవరాపల్లి: దేవరాపల్లిలో డిప్యూటీ తహశీల్దార్ అప్పారావుకు ఏపీయూడబ్ల్యూజే నాయకులు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డి.సన్యాసిరావు, పి.గణేష్, గున్నయ్యశెట్టి, కె.అప్పారావు, బి.రామరాజు, ప్రసాదు, నాగేషు, ఆరినాయుడు, రొప్పలరాజు, కెల్లప్పలరాజు, వనుం శ్రీను పాల్గొన్నారు,

మాడుగుల: స్థానిక తహశీల్దార్ కార్యాయం ఎదుట ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు రొబ్బా శ్రీను ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ రమాదేవికి వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఏలూరి సురేష్, పుట్టా శ్రీను, బి జగ్గారావు, నారాయణరావు, జనార్దనరావు, శివ, నాయుడు, శ్రీను, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట: అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ తహశీల్దార్ నాగమ్మకు ఏపీయూడబ్ల్యూజే నేతలు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఆనంద్, శ్రీరామమూర్తి, శ్రీను, దారబాబు తదితరులు పాల్గొన్నారు.

ఈతలో డాక్టరమ్మ రాణింపు



ఈ ఏడాది మార్చిలో గుజరాత్‌లో కాంస్య పతకం అందుకుంటున్న డాక్టర్ సాయిశ్రీ (ఫైల్ ఫొటో)

జాతీయ స్థాయి ఈత పోటీల్లో మినుములూరు పీహెచ్‌సీ డాక్టర్ సాయిశ్రీ సత్తా

- నాలుగో ఏట నుంచే ఈతపై ఆసక్తి
- 20 ఏళ్లలో 112 పతకాలు కైవసం
- అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపేందుకు సమాయత్తం

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

పాడేరు మండలంలోని మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలిగా పని చేస్తున్న డాక్టర్ సాయిశ్రీ ఈత పోటీల్లో రాణిస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు. తన నాలుగో ఏట నుంచే ఈత నేర్చుకుని పోటీల్లో పాల్గొంటూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో మొత్తం 112 పతకాలు సాధించానని ఆమె తెలిపారు. ఈ ఏడాది మార్చిలో గుజరాత్‌లో జరిగిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ అధికారుల 2024-25 ఈత పోటీల్లోనూ ఆమె ప్రతిభ చూపి రెండు కాంస్య పతకాలు సాధించారు. ఈతపై ఆమెకున్న ఆసక్తి, చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ, రాణింపు, భవిష్యత్తు లక్ష్యాన్ని ఆమె మాటల్లోనే తెలుసుకుందాం.

స్వస్థలం విజయవాడ...

మాస్వస్థలం విజయవాడ. మాది మధ్యతరగతి కుటుంబం. నాన్న మధుసూదనరావు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, తల్లి ధనలక్ష్మి గృహిణి, చెల్లెలు సాయిప్రియ రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నది.

ఆరేళ్లకే కృష్ణా నదిలో ఈత

2004లో నా వయస్సు కేవలం ఆరేళ్లు. అప్పట్లోనే కృష్ణా నదిలో ఈదాను. నాలుగో ఏట నుంచే ఈతపై ఆసక్తితో పట్టుసాధించి ఆరేళ్ల వయస్సు వచ్చే సరికి కృష్ణానదిలో ఈతుకుంటూ ఇవతల నుంచి అవతల ఒడ్డుకు చేరుకున్నాను. ఎంబీబీఎస్ మినహా చదువంతా విజయవాడలోనే సాగింది. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు కెనడి స్కూల్‌లో, ఆరు నుంచి పదో తరగతి వరకు గాంధీ హైస్కూల్లో, ఇంటర్ శ్రీచైతన్యలో పూర్తి చేసి ఎంబీబీఎస్ గాయత్రి



మినుములూరు పీహెచ్‌సీ డాక్టర్ వెలివెల సాయిశ్రీ

విద్యాపరిషత్ అండ్ మెడికల్ సైన్సు విశాఖపట్నంలో పూర్తి చేశాను. 2024లో మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలిగా పోస్టింగ్‌లో చేరాను. డాక్టర్‌గా సేవలందించడం, మరో వైపు స్విమ్మింగ్ క్రీడాకారిణిగా నా ఆసక్తి నెరవేర్చుకోవడం కొన్ని సందర్భాల్లో కష్టంగా అనిపించినా రెండిటికీ న్యాయం చేసేందుకే మొగ్గు చూపుతున్నాను.

20 సంవత్సరాల్లో 112 పతకాలు

గత 20 ఏళ్లుగా ఈత పోటీల్లో పాల్గొని 112 వరకు పతకాలు సాధించాను. 2004లో రాష్ట్ర స్థాయి 50 మీటర్ల విభాగం ఈత పోటీల్లో తొలిసారి బంగారు పతకాన్ని సాధించి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరెడ్డి చేతుల మీదుగా పతకాన్ని అందుకున్నాను. అలాగే 2006లో గోవాలో జరిగిన జాతీయ స్థాయి ఈత పోటీల్లో బంగారు పతకాన్ని పొందాను. అప్పటి నుంచి మొదలు ఇప్పటి వరకు జాతీయ స్థాయిలో 5 బంగారు పతకాలు, రాష్ట్ర స్థాయిలో 72 బంగారు, 24 వెండి, 11 క్యాంస పతకాలను సాధించాను. ఈ ఏడాది మార్చిలో గుజరాత్‌లో జరిగిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ 2024- 25 ఈత పోటీల్లోనూ 50, 100 మీటర్ల విభాగాల్లోనూ రెండు కాంస్య పతకాలు సాధించాను. వైద్యురాలిగా పని చేస్తూ ఈత పోటీల్లో రాణించినందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, శ్యాప్ ఎండీ గిరిశా, కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్, తదితరులు అభినందనలు తెలపడం జీవితంలో మర్చిపోలేని అనుభూతి. తల్లిదండ్రుల సహకారంతో ఈత పోటీల్లో రాణిస్తున్న నన్ను ప్రభుత్వం మరింత ప్రోత్సహిస్తే అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి రాష్ట్రానికి మరింత ఖ్యాతి తీసుకురావాలనే లక్ష్యంతో ఉన్నాను. అందుకు అందరూ ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను.



డాక్టర్ సాయిశ్రీని అభినందిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ (ఫైల్)

9న పాడేరుకు ముఖ్యమంత్రి?

▸ ఆదివాసీ దినోత్సవానికి హాజరుకానున్న చంద్రబాబు



పాడేరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పాడేరులో ఈనెల తొమ్మిదిన నిర్వహించే అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవానికి ముఖ్యఅతిథిగా సీఎం చంద్రబాబునాయుడు హాజరయ్యే అవకాశం ఉందని తెలిసింది. ఈ మేరకు సీఎంవో నుంచి జిల్లా అధికారులకు సమాచారం అందింది. సభా వేదిక, ఇతర ఏర్పాట్లు ఎక్కడ చేయాలన్న దానిపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. పాడేరు సమీపంలోని ఓ గిరిజన పల్లె వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని భావిస్తున్నారు. సీఎం పర్యటన సమన్వయకర్త పెందుర్తి వెంకటేశ్ బుధవారం ఇక్కడికి వచ్చి సభా వేదిక, తదితరాలపై అధికారులకు సూచనలు చేస్తారని, అనంతరం సీఎం పర్యటనపై ఒక స్పష్టత వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

పేరుకే పెద్దేరు..

... 5వ పేజీ తరువాయి

ఆధునికీకరణకు నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభం అవుతాయని రెండేళ్ల క్రితం అప్పటి మంత్రి బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ ప్రకటించారు. కానీ నిధులు విడుదల కాలేదు.. కాలువ బాగుపడలేదు. కాలువలో కనీసం పూడిక కూడా తీయించలేదు. జిల్లాలో ఇతర జలాశయాల పరిధిలోని పంట కాలువల్లో ఉపాధి హామీ పథకం కింద పూడికలు తీయిస్తున్నారని, పెద్దేరు కుడికాలువలో కూడా పూడిక తీయించి వుంటే ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అయినా ఆయకట్టుకు నీరు సరఫరా అయ్యేదని రైతులు అంటున్నారు. మాడుగుల, చోడవరం ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు చొరవచూపి కుడి కాలువలో పూడిక, తుప్పలు తొలగించేలా చర్యలు చేపట్టాలని ఆయకట్టుదారులు కోరుతున్నారు.

బల్క్‌డ్రగ్ పార్కుపై నేడు ప్రజాభిప్రాయ సేకరణ

... 5వ పేజీ తరువాయి

ప్రజాభిప్రాయసేకరణ జరిగింది. బల్క్‌డ్రగ్ పార్కుకు మరో 814 ఎకరాలకు సంబంధించి బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించేందుకు ఏపీఐఐసీ, పర్యావరణం, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ భూములు సీహెచ్ఎల్ పురం, పెదతీనార్ల, ఎస్.నర్సాపురం, ఉపమాక, ఎస్.రాయవరం మండలం గుడివాడ గ్రామాల పరిధిలో వున్నాయి. నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రజాభిప్రాయ సేకరణ కోసం నిర్మిస్తున్న సభావేదిక, ఇతర ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ, డీఎస్పీ వి.శ్రీనివాసరావు, సీఐలు కె.కుమారస్వామి, ఎల్.రామకృష్ణ పరిశీలించారు. జిల్లాలో వివిధ స్టేషన్ల నుంచి పోలీసు సిబ్బందిని బందోబస్తు కోసం నియమించారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, నిర్వాసితులకు సంబంధించి 15 నుంచి 20 మంది తమ అభిప్రాయాలను చెప్పేందుకు అవకాశం కల్పిస్తారు. కాగా బల్క్ డ్రగ్ పార్కుకు తమ భూములు ఇచ్చేది లేదంటూ ఆయా గ్రామాల రైతులు, మత్స్యకారులు కొద్ది రోజుల నుంచి సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళలు చేస్తున్నారు.

గూడు కోసం వెతుకులాట!

... 5వ పేజీ తరువాయి

వార్డుల్లో పడలక సంఖ్యను పెంచాలని పాలకమండలి సభ్యులు నిర్ణయించారు. ఇందుకోసం డీఎంహెచ్ఓ కార్యాలయాన్ని ఖాళీ చేయించాలని భావించారు. ఈ మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ నెల రోజుల కిందట డీఎంహెచ్‌వోకు నోటీసు జారీ చేసినట్టు తెలిసింది. అప్పటి నుంచి అద్దె భవనం కోసం వెతుకుతున్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం నెలకు చదరపు అడుగుకు రూ.10 చొప్పున అద్దె చెల్లిస్తారు. కానీ ఈ రేటుకు భవనం అద్దెకు ఇవ్వడానికి ఎవరూ ముందుకు రావడం లేదని తెలిసింది. పైగా ప్రభుత్వ కార్యాలయం కావడంతో అద్దె డబ్బులు సకాలంలో అందవేమోనన్న ఉద్దేశంతో పలువురు విముఖత చూపుతున్నట్టు సమాచారం. డీఎంహెచ్ఓ ఇటీవల ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను కలిసి, ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో ఖాళీగా ఉన్న భవనాల్లో ఒకదానిని కేటాయించాలని కోరినట్టు తెలిసింది. ఆమోదం లభిస్తే డీఎంహెచ్ఓ కార్యాలయాన్ని అక్కడకు మారుస్తారని సిబ్బంది చెబుతున్నారు.

మానవ తప్పిదమే

▸ లుపిన్‌లో ప్రమాదంపై అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాంకీ ఫార్మా సిటీలోని లుపిన్ కంపెనీలో సోమవారం ఉదయం జరిగిన ప్రమాదానికి (విషవాయువు లీకేజీ) కారణం మానవ తప్పిదమేనని అధికారులు అంగీకరిస్తున్నారు. సంస్థలో అత్యాధునిక యంత్ర పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం ఉన్నప్పటికీ వాటిని ఆపరేట్ చేసే సిబ్బందికి సరైన అవగాహన కల్పించడంలో యాజమాన్యం విఫలమైంది.

లుపిన్‌లో గత నెల అంటే జూలై 8వ తేదీన ఇలాగే విషవాయువు లీకైంది. అప్పుడు ఒకరు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. ఆ విషయం రెండు రోజుల వరకూ బయటకు చెప్పలేదు. తాజా ఘటనలోను అలాగే చేశారు. సోమవారం ఉదయం మూడు గంటల సమయంలో ప్రమాదం జరిగితే 11 గంటల తరువాత అధికారులకు సమాచారం ఇచ్చారు. ఏ రకమైన విషవాయువు వెలువడిందో గుర్తించాల్సిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు అసలు సమాచారమే ఇవ్వలేదు. మీడియా ద్వారా విషయం తెలుసుకున్న అధికారులు మధ్యాహ్నం మూడు గంటలకు అక్కడకు బయలుదేరి వెళ్లారు. అంటే జరిగింది తప్పు అని, దానిని దాచి పెట్టాలని యాజమాన్యం యత్నించినట్టు చాలా స్పష్టంగా అర్థమైంది.

లెటర్ మొవిర్ తయారీలో లీకేజీ

లుపిన్ ఫార్మాలోని మల్టీ ప్రొడక్షన్ రెండో బ్లాకులో 'లెటర్ మొవిర్' మందు తయారుచేసిన తరువాత వ్యర్థాలను ఫిల్టర్ చేస్తున్నప్పుడు గుర్తు తెలియని విషవాయువులు వెలువడ్డాయి. అక్కడ తనిఖీకి వెళ్లిన షిఫ్ట్ ఇన్‌చార్జి సరైన మాస్క్ ధరించకపోవడం వల్ల ఆ వాయువు పీల్చి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే షీలానగర్‌లోని కిమ్స్‌కు తరలించారు. అయితే ఆ గది నుంచి విషవాయువులు వస్తున్నాయని ఎటువంటి హెచ్చరికలు చేయకపోవడం గమనార్హం. పక్క యూనిట్‌లో పనిచేస్తున్నవారు వెళ్లి అక్కడి వారిని రక్షించారు. అలా సాయపడిన వారికి ఇబ్బంది రావడంతో వారినీ ఆస్పత్రిలో చేర్చారు. మొత్తం ఆరుగురు కిమ్స్‌లో ఉన్నారు. బాధితులను చూడాలని యత్నిస్తే ఆస్పత్రి వర్గాలు అనుమతించకపోవడం గమనార్హం.

ఆ సమయంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అక్కడికి రాగా బాధితులు ఆయన్ను చుట్టుముట్టారు. దాంతో ఘటన జరిగిన 18 గంటల తరువాత అంటే రాత్రి తొమ్మిది గంటల తరువాత కుటుంబ సభ్యులను ఆస్పత్రిలోకి అనుమతించారు. ఇవన్నీ చూస్తుంటే...ఏదో దాయాలని అన్ని వర్గాలు యత్నిస్తున్నాయనే విషయం స్పష్టమవుతోంది.

లెటర్‌మొవిర్ ఒక్కో మాత్ర రూ.2 వేలు

సైటోమెగలో వైరస్ (సీఎంవీ) ఇన్‌ఫెక్షన్ సోకిన వారికి, అవయవ మార్పిడి చేయించుకున్న రోగులకు లెటర్‌మొవిర్ మాత్రలు సిఫారసు చేస్తారు.

ఈ మాత్ర ఒక్కొక్కటి రూ.2 వేలు. పది మాత్రల స్ట్రిప్ రూ.20 వేలకు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఈ మందు తయారీ సమయంలోనే విషవాయువు లీకైంది. అది ఏమిటన్నది ఇంకా గుర్తించలేదు. గత నెలలో వెలువడిన వాయువు ఏమిటో కూడా ఇప్పటివరకూ వెల్లడించలేదు. ఆ వాయువు ఆనవాళ్లు తెలుసుకోకూడదనే పీసీబీ అధికారులకు యాజమాన్యం తక్షణ సమాచారం ఇవ్వడం లేదు. వీటన్నింటిపై సమగ్ర విచారణ చేయాల్సి ఉంది.

కఠిన చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల వేదిక డిమాండ్

ఈ ఘటనపై మానవ హక్కుల వేదిక ఉమ్మడి విశాఖ ప్రధాన కార్యదర్శి కె.అనురాధ, సహాయ కార్యదర్శి జీడర్ రహమాన్‌లు స్పందించారు. కంపెనీలు ప్రమాద కారణాలను గోప్యంగా ఉంచడంపై చూపే శ్రద్ధ భద్రతపై పెట్టాలని సూచించారు. ఈ ప్రమాదానికి వ్యవస్థాపక కారణాలు అధికారికంగా వెల్లడించాలని, బాధితులకు ఉచిత వైద్యసేవలు, ఆర్థిక పరిహారం అందించాలని, యాజమాన్య ప్రతినిధులు, పరిశ్రమ భద్రతా అధికారులపై శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఫార్మా సిటీలో పబ్లిక్ అలర్ట్ వ్యవస్థ, ఆపత్కాల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కోరారు.

బంగారు కుటుంబాల లక్ష్యాన్ని పూర్తి చేయండి

▸ అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాలను మ్యాపింగ్ చేయడానికి అవసరమైన మార్గదర్శుల ఎంపిక త్వరతగతిన పూర్తి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్వర్ణాంధ్ర జీరో పావర్టీ (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్ షిప్)లో భాగంగా బంగారు కుటుంబాల మ్యాపింగ్‌పై మంగళవారం ఉదయం అమరావతి నుంచి సీఎం చంద్రబాబునాయుడు, అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనకాపల్లి నుంచి కలెక్టర్ విజయకృష్ణన్ పాల్గొన్నారు. అనంతరం ఆమె జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఇప్పటి వరకు ఎంపిక చేసిన మార్గదర్శుల బంగారు కుటుంబాలకు మ్యాపింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను ఈ నెల 15వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఓ రామారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ విజయకృష్ణన్, అధికారులు

హాట్‌కేకుల్లా సీఎస్ఈ సీట్లు

... 5వ పేజీ తరువాయి

విభజించి భర్తీచేస్తారు. ఎంసెట్ ర్యాంకర్లతో ఏ కేటగిరీ సీట్లను భర్తీచేస్తారు. కాలేజీకి కేటాయించిన సీట్లలో 70 శాతం సీట్లు ఏ కేటగిరీలో ఉంటాయి. మిగిలిన 30 శాతం సీట్లను 'బి' కేటగిరీ కింద పరిగణిస్తారు.

ఇదిలావుంటే కొందరు కోర్టును ఆశ్రయించడంతో రెండో విడత కౌన్సెలింగ్ వాయిదా పడింది. అయితే, మేనేజ్‌మెంట్ కోటా సీట్లను ఇప్పటికే చాలావరకు కాలేజీలు భర్తీ చేసుకున్నట్టు చెబుతున్నారు. అయితే, వీటిలెక్కలను అధికారులు వెల్లడించడం లేదు.

మేనేజ్‌మెంట్ సీటు హాట్ గురు..

జిల్లాలోని ప్రముఖ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు పోటీ నెలకొంది. మొదటి మూడు, నాలుగు స్థానాల్లో నిలిచే కాలేజీల్లో కంప్యూటర్ సైన్స్‌కు సంవత్సరానికి రూ.4 లక్షల నుంచి ఆరు లక్షల రూపాయల వరకూ తీసుకుంటున్నట్టు చెబుతున్నారు. ఒక ప్రముఖ కాలేజీలో అయితే రూ.ఏడు లక్షల వరకూ పలుకుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈసీఈ, ఐటీ వంటి బ్రాంచీలకు ఆ నాలుగు కాలేజీల్లో సంవత్సరానికి రూ.2.2 లక్షల నుంచి రూ.3 లక్షల వసూలు చేస్తున్నట్టు చెబుతున్నారు. రెండో కేటగిరీగా చెప్పుకునే కాలేజీల్లో కూడా కంప్యూటర్ సైన్స్‌కు ఏడాదికి రూ.1.7 లక్షల నుంచి నుంచి రూ.2 లక్షల వరకూ, మిగిలిన బ్రాంచీలకు రూ.లక్షన్నర వసూలు చేస్తున్నారు. ప్రముఖ కళాశాలల్లో కంప్యూటర్ సైన్స్ ఈసీఈ, ఐటీ వంటి కోర్సుల్లో సీట్లు అయిపోయాయి. రెండు, మూడు కేటగిరీలకు చెందిన కాలేజీల్లో మిగిలిన బ్రాంచీల్లో సీట్ల కోసం రూ.80 వేలు నుంచి లక్ష రూపాయలు వరకూ వసూలు చేస్తున్నారు. అయితే, ఆయా కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు కూడా ఆసక్తి చూపించకపోవడం గమనార్హం.

హాస్టళ్లకు హంగులు!

... 5వ పేజీ తరువాయి

కొత్త రూపు తెస్తున్నారు. అన్ని బాలికల వసతిగృహాలకు ప్రహరీ గోడల నిర్మాణం పూర్తి చేశారు. విద్యార్థులు వుండే గదుల్లోకి దోమలు రాకుండా కిటికీలకు మెష్‌లు, మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించారు.

సీఎస్ఆర్ నిధులతో..

కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులు రూ.70 లక్షలతో పలు వసతిగృహాలకు మరమ్మతు పనులు చేపట్టారు. కిటికీలు, తలుపులు కొత్తవి అమర్చారు. నిరుపయోగంగా మారిన 38 మరుగుదొడ్లను బాగు చేయించి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. ప్రతి వసతిగృహానికి రూ.1.5 లక్షల చొప్పున కేటాయించి కొత్తగా మిక్సీలు, గ్రైండర్లు, వంట పాత్రలు సమకూర్చారు.

స్విమ్మింగ్ పూల్‌లో యువకుడి మృతి

... 5వ పేజీ తరువాయి

స్నేహితులు కలిసి కొండకర్ల ఆవ సమీపంలో వున్న జీవీఈహెచ్ రిసార్ట్‌కు వచ్చారు. మద్యం సేవిస్తూ మధ్యాహ్నం వరకు స్విమ్మింగ్ పూల్‌లో సరదాగా గడిపారు. అనంతరం భోజనం చేయడానికి భాస్కర్ మినహా మిగిలిన వారు రిసార్టులోని గదుల్లోకి వెళ్లారు. కొద్దిసేపటి తరువాత భాస్కర్ స్విమ్మింగ్ పూల్‌లో మునిగిపోయి కనిపించాడు. రూమ్ బాయ్ గమనించి అతని స్నేహితులకు తెలియజేశాడు. వారు వచ్చి భాస్కర్‌ను బయటకు తీసి సీపీఆర్ చేశారు. అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తీసుకెళ్లారు. కానీ అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. సమాచారం అందుకున్న పోలీసులు రిసార్ట్ వద్దకు వచ్చి వివరాలు సేకరించారు. స్విమ్మింగ్ పూల్ వద్ద వున్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. భాస్కర్ మద్యం మత్తులో ఈతకొడుతూ అలసిపోయి లేదా గుండెపోటు వచ్చి నీటిలో మునిగి మృతిచెందినట్టు ప్రాథమికంగా భావించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

అనుమతులు లేని రిసార్ట్

కొండకర్లకు చెందిన వైసీపీ నాయకుడొకరు ఎటువంటి అనుమతులు లేకుండా రిసార్ట్ నిర్వహిస్తున్నారు. స్విమ్మింగ్ పూల్‌లో భాస్కర్ తరహాలోనే గతంలో నలుగురు యువకులు మృతిచెందారు. కానీ అధికారులు ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతూ గుండెపోటు రావడంతో మృతిచెందినట్టు పోలీసులు రికార్డుల్లో నమోదు చేయడం విశేషం.

క్రైం... crime news

తిక్కవానిపాలెం సాగర తీరంలో మృతదేహం

▸ మృతుడి స్వస్థలం అనకాపల్లి మండలం గోపాలపురం



గొర్లె నాగేశ్వరరావు (ఫైల్ ఫొటో)

కూర్మన్నపాలెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తిక్కవానిపాలెం సముద్ర తీరానికి ఓ వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చినట్టు దువ్వాడ సీఐ కె.మల్లేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అనకాపల్లి మండలం గోపాలపురానికి చెందిన గొర్లె నాగేశ్వరరావు (30) ఈ నెల 3న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో అనకాపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా మంగళవారం ఉదయం తిక్కవానిపాలెం తీరానికి ఓ మృతదేహం కొట్టుకువచ్చిందన్న సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లి చూడగా అది నాగేశ్వరరావుదని గుర్తించారు. నాగేశ్వరరావు సరదాగా స్నానం చేసేందుకు బీచ్‌కు వెళ్లి ఉంటాడని, ప్రమాదవశాత్తు ఈత రాక మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. నాగేశ్వరరావు అన్నయ్య అప్పారావు ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి తల్లి నూకాలమ్మ, భార్య సంధ్య ఉన్నారు. కాగా పరవాడ సమీపంలోని మైలాన్ కంపెనీలో నాగేశ్వరరావు పనిచేసేవాడు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

అచ్యుతాపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆరు సెల్‌ఫోన్‌లతో పాటు నగదు చోరీ చేసిన వ్యక్తిని గంటల వ్యవధిలోనే పట్టుకున్నట్టు సీఐ నమ్మి గణేశ్ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. సెజ్‌లోని మేట్రిక్స్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న తాడి సూర్యప్రసాద్‌తోపాటు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఆరుగురు కార్మికులు కలిసి మండలంలోని మార్టూరులో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం వుంటున్నారు. ఈ నెల మూడో తేదీ అర్ధరాత్రి 12 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి, ఇంటి లోపలి గడియ విరగ్గొట్టి లోపలికి ప్రవేశించాడు. తిరిగి వెళ్లే క్రమంలో ఇతని కాలు, నిద్రపోతున్న వారిలో ఒక వ్యక్తికి తగలింది. దీంతో అతను నిద్రలేచి పెద్దగా అరవగా.. దొంగ పారిపోయాడు. ఈ క్రమంలో చోరీకి వచ్చిన వ్యక్తి సెల్‌ఫోన్ పడిపోయింది. అందరూ నిద్రలేచి ఇతర గదుల్లో పరిశీలించగా.. ఒక గదిలో వుంచి ఆరు సెల్ ఫోన్లు, రూ.5 వేల నగదు కనిపించలేదు. దీంతో తాడి సూర్యప్రకాశ్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడి సెల్ ఫోన్ ఆధారంగా అచ్యుతాపురానికిచెందిన చందక గోపి చోరీకి పాల్పడినట్టు గుర్తించి మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి ఆరు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని, అతను వినియోగిస్తున్న బైక్‌ను సీజ్ చేశారు. ఇతనిపై పలు పోలీసు స్టేషన్లలో దొంగతనం కేసులు వున్నట్టు సీఐ చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

ఆటోలు ఢీకొని ఇద్దరికి గాయాలు

సబ్బవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సబ్బవరంలో ఆగి ఉన్న ఆటోను స్కూల్ పిల్లలతో వెళుతున్న మరో ఆటో ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా వున్న ఒక ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో కొంతమంది సోమవారం సాయంత్రం తరగతులు ముగిసిన తరువాత ఆటోలో ఇళ్లకు తిరిగి వెళుతున్నారు. జోడుగుళ్ల సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న మరో ఆటోను ఢీకొన్నది. దీంతో ముందు ఆటోలో ఉన్న కొత్తవలసకు చెందిన కోడూరు రామకృష్ణ, స్కూల్ ఆటోలో వున్న స్థానిక గోపాల్‌నగర్‌కు చెందిన 4వ తరగతి విద్యార్థిని జోష్మిత గాయపడ్డారు. సమాచారం అందుకున్న సీఐ రామచంద్రరావు సిబ్బందితో వెళ్లి, క్షతగాత్రులను స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

చీటింగ్ కేసులో నిందితుడి అరెస్టు

చోడవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): చీటింగ్ కేసులో 13 సంవత్సరాలుగా పరారీలో ఉన్న నిందితుడిని సోమవారం సాయంత్రం అరెస్టు చేశామని స్థానిక సీఐ బి. అప్పలరాజు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఎలమంచిలి మండలం లైను కొత్తూరుకు చెందిన నౌడు ప్రసాద్ అలియాస్ లౌడ్ ప్రసాద్ 2013లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురి నుంచి వేలాది రూపాయలు వసూలు చేశాడు. అతనికి డబ్బులు ఇచ్చి మోసపోయిన బాధితులు కేసు పెట్టారు. అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న ప్రసాద్‌ను సోమవారం సాయంత్రం హెడ్ కానిస్టేబుల్ నాగేంద్రకుమార్, కానిస్టేబుల్ అప్పలరాజులు మండలంలోని వెంకన్నపాలెం జంక్షన్ వద్ద పట్టుకున్నారు. అతనిని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ అప్పలరాజు తెలిపారు.

దాడి కేసులో ఒకరి అరెస్టు

నర్సీపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): టైర్ పంక్చర్ షాపు యజమానిపై దాడి చేసిన కేసులో పట్టణ పోలీసులు ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. సీబీఎం కాంపౌండ్ వద్ద రుత్తల శ్రీనుకి సంబంధించిన టైర్ పంక్చర్ షాపునకు గుర్రాల రోడ్డులో నివాసం ఉంటున్న తెన్నేటి సూర్యచంద్రరావు ఉరఫ్ జాన్ జీపు మరమ్మతులు చేయించుకొని డబ్బులు ఇవ్వకుండా వెళ్లిపోయాడని సీఐ గోవిందరావు తెలిపారు. గత నెల 19వ తేదీన జాన్‌ను రిపేరు డబ్బులు అడగా రుత్తల శ్రీనుపై దాడి చేసి కంటికి గాయం చేశాడన్నారు. ఆయన భార్య పద్మసాయి లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు జాన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించామని సీఐ తెలిపారు.

మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు

నర్సీపట్నం అర్బన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ రాజారావు తెలిపారు. మంగళవారం ధర్మసాగరం కూడలి వద్ద రూరల్ పోలీసులు తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసు నమోదు చేసి మూడు వాహనాలు సీజ్ చేశామని ఎస్ఐ తెలిపారు.

దేవరాపల్లిలో వైసీపీ జడ్పీటీసీ సభ్యుల భేటీ

▸ వైసీపీ పెద్దల ఆదేశాలతో సన్మానానికే పరిమితం



దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం దంపతులను సత్కరిస్తున్న సభ్యులు

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దేవరాపల్లి మండలం మామిడిపల్లిలో మంగళవారం జిల్లాలోని వైసీపీ జడ్పీటీసీ సభ్యులు, ఫోరం అధ్యక్షుడు కర్రి సత్యం అధ్యక్షతన సమావేశమయ్యారు. జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రకు వ్యతిరేకంగా చర్చించేందుకు వీరంతా సమావేశమవుతున్నారని తెలిసి వైసీపీ పెద్దలు జోక్యం చేసుకున్నారని సమాచారం. దీంతో జడ్పీటీసీ సభ్యులఫోరం అధ్యక్షుడిగా ఎన్నికైన కర్రి సత్యం సన్మానంతో భేటీని ముగించారని తెలిసింది. సమావేశానికి 22 మంది జడ్పీటీసీ సభ్యులు వచ్చారని కర్రి సత్యం వర్గీయులు చెబుతుండగా, కేవలం 12 మంది మాత్రమే హాజరయ్యారని చైర్‌పర్సన్ వర్గీయులు వెల్లడించారు. వైస్‌చైర్మన్ గిరిబాబు, సభ్యులు ఈర్లె అనురాధ, పెంటకోట స్వామి సత్యనారాయణ, డాక్టర్ వెంకటలక్ష్మి, పలువురు మహిళా సభ్యుల తరఫున వారి భర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కర్రి సత్యం మాట్లాడుతూ ఫోరం అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా విందు ఇచ్చానని చెప్పారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	475
విజయనగరం	479
శ్రీకాకుళం	479